Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

బుధవారం, 11 సెప్టెంబర్ 2024 | విజయవాడ | సంపుటి: 01 - సంచిక : 92 | పేజీలు : 12 వెల రూ.6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

IRS PUBLICATIONS

irspublications12@gmail.com



పంటరుణాలను మాఫీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విన్నవిస్తున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

## కాంగ్రెస్‌లో సీనియర్లకు..

# షర్మిల షాక్



**సూర్య వాస్తవం - స్పెషల్ డెస్క్..**

- పీసీసీ తెరపై సరి కొత్త ముఖాలు..
- రాష్ట్ర పార్టీకి నూతన జవసత్వాలు..
- 2029 నాటికి ఏపీలో కాంగ్రెస్ సర్కార్ ..
- వినూత్నంగా రాష్ట్ర కార్యవర్గం ప్రకటన..
- పాత కాపులకు అన్నింటా నో ఎంట్రీ..
- 25 జిల్లాల డీసీసీలకు కమిటీల ఏర్పాటు..
- సిటీ కమిటీల్లో కొత్త వారికే ప్రాధాన్యం..
- 37 మంది ప్రధాన కార్యదర్శుల నియామకం..
- 13 మంది ఉపాధ్యక్షుల్లో కొత్తవారికి చోటు..
- అయోమయంగా అసమ్మతి నేతల పరిస్థితి..
- కాంగ్రెస్ రాజకీయాల్లో షర్మిల మార్క్..

తేలును తలకెక్కించుకుంటే వళ్లంతా కుట్టిందనేది.. గ్రామీణ సామెత .. పీసీసీ చీఫ్ షర్మిల విషయంలోనూ సరిగ్గా.. ఆ పార్టీలోని కొందరు..ఆమెను అలానే తలుచుకుంటున్నారు. తరుచూ ఎదురవుతున్న చేదును దిగమింగక వారికి తప్పడం లేదు. రాజన్న బిడ్డని ఓర్చుకుంటూనే.. చింతించక తప్పడం లేదు. పట్ట పగలే ఆమె తన వ్యతిరేకులకు పలు మార్లు చుక్కలు చూపిస్తున్నారు. పార్టీ పగ్గాలు చేపట్టిన నాటినుంచి షర్మిల వ్యవహార శైలి.. పార్టీలోని కొందరికి.. ఇప్పటికీ కొరగాని కొయ్యలానే మిగిలింది. ఆమె ఏది చేసినా.. కిమ్మనకుండా సర్దుకు పోక వారికి తప్పడం లేదు.

ఒక దశలో.. పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ స్థాయిలో ఒకరిద్దరు వ్యతిరేకించినా,షర్మిల స్పీడును తగ్గించ లేక పోయారు. ఢిల్లీ హై కమాండ్‌లో బలంగా పాగా వేసిన 'ఆమెను' కాదని ఎదురు నిలువలేక పోతున్నారు. అధిష్ఠానం అన్నింటా ఆమెకు వెన్నంటి నిలువడంతో.. కొందరు ఒంటిరిగా మిగలక తప్పడంలేదు. తాజాగా పీసీసీ నియామకాల జాబితా అదే నిజమని తేల్చి చెపుతోంది. షర్మిల తెరపైకి తెచ్చిన కమిటీలకే చివరకు అధిష్ఠానం ఆమోద ముద్ర వేసింది. పార్టీ సీనీయర్లను ఏమార్చినా కొత్త మొఖాలకే హారతులు పట్టింది. ఏపీలోని 25 జిల్లా కమిటీలకు ఏఐసీసీ ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనిలో పనిగా 13 మంది వైస్ ప్రసిడెంట్లు, 37 మంది జనరల్ సెక్రటరీలు, 10 మంది సీటీ కమిటీలకు అధ్యక్షులుగా షర్మిల ప్రతిపాదనలకే ఓకే చెప్పింది. ఏతా..వాతా, పీసీసీ నియామకాల్లో షర్మిల మాటే

- మిగతా 2లో..



## మోడీ అంటే ద్వేషం లేదు

**వాషింగ్టన్-సూర్య వాస్తవం**

ప్రధాని మోడీ అంటే తనకు ద్వేషం లేదని, నిజానికి ఆయనను అర్థం చేసుకోగలనని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం వాషింగ్టన్‌లోని జార్జిటౌన్ యూనివర్శిటీలో ఓ చర్చా కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీకు ఆశ్చర్యం కలిగించినప్పటికీ.. మోడీ అంటే తనకు ద్వేషం లేదని అన్నారు. ఆయన తీసుకునే నిర్ణయాలు, అభిప్రాయాలు వేరని, ఆయనతో తాను ఏకీభవించలేనని అన్నారు. మోడీని ద్వేషించడం లేదని, శత్రువుగా చూడటం లేదని అన్నారు. తమవి భిన్న దృక్కోణాలని అన్నారు. ఆయన తీసుకునే నిర్ణయాలను తాను అర్థం చేసుకోగలనని, అయితే అవి మంచి ఫలితాలు ఇస్తాయని తాను భావించడం లేదని అన్నారు. అమెరికాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం రాహుల్ గాంధీ ఆదివారం టెక్సాస్ చేరుకున్న సంగతి .

- మిగతా 2లో..

## దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర

**- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్-సూర్య వాస్తవం**

దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని , మన దేశాభివృద్ధి లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. భారీ రుణ భారం తెలంగాణకు సవాల్ గా మారిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణ భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుంది. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలు ఉన్నాయన్నారు. గత పదేళ్లలో ప్రభుత్వం భారీ గా అప్పులు తీసుకుంది. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితిని

- మిగతా 2లో..

## వరద బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాం

**- హోంమంత్రి వంగలపూడి అనిత**

**విశాఖ-సూర్య వాస్తవం**



విజయవాడ వరద బాధితులను ఆదుకు నేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖ పట్నంలోని ప్రభుత్వ అతిథి గఅహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విపత్తుల నిర్వహణలో సీఎం చంద్రబాబు ఆదర్శంగా నిలుస్తున్నారు అని , నిరంతరం సమీక్షలు క్షేత్రస్థాయి పర్యటనలతో యుద్ధ ప్రాతిపదికన ముఖ్యమంత్రి సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని వరద ప్రాంతాలలో పునరుద్ధరణ సాయక చర్యలకు కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛ అవసరమైన నిధులు అందుబాటులో ఉంచామని రోడ్లతోపాటు ఇళ్ళను కూడా శుభ్రం చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని ఆమె అన్నారు. డ్రోన్ ల ద్వారా ఆహారం పంపిణీతో పాటు క్లోరినేషన్ చేయడం జరిగిందని అన్నారు. వరదలు సంభవించిన 3,4 రోజుల్లోనే విద్యుత్ సరఫరా లు పునరుద్ధరించామని వార్డుకో సీనియర్ ఐఏఎస్, కాలనీకు మంత్రి నియమించి వరద బాధితులు ఆదుకున్నామని ఆమె అన్నారు అంతేకాకుండా బోడమేరు గండ్లను అంత త్వరగా పోల్చడం చిన్న విషయం కాదని ఆమె అన్నారు. 74 ఏళ్ళ వయసులో తీరిక లేకుండా పనిచేస్తున్న

- మిగతా 2లో..

## వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**- ముఖ్యమంత్రిని కలిసిన సీపీఎం నాయకులు**



**విజయవాడ-సూర్య వాస్తవం**

విజయవాడలో వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తక్షణమే రూ.10 వేల కోట్లను విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు కోరారు. ప్రస్తుతం వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తక్షణ సాయం కింద రూ.10 వేల కోట్లను విడుదల చేయాలని ఈ మేరకు కేంద్రాన్ని కోరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సిపిఎం రాష్ట్ర ప్రతినిధి బృందం కోరింది. మంగళవారం ఉదయం ఎన్‌టిఆర్ కలెక్టరేట్ లో సిఎం చంద్రబాబును సిపిఎం రాష్ట్ర ప్రతినిధి బృందం కలిసింది. ఈ బృందంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్. బాబూ రావు, ఈ.ఉమామహేశ్వరరావు, డి.రమాదేవి, ప్రభాకరరెడ్డి ఉన్నారు. వరదలపై కేంద్రం తక్షణమే స్పందించాలని కోరారు. వరద బాధితులకు పై స్థాయిలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలో ని మరిన్ని వార్తల కోసం సంప్రదించం డి

## మోడీ అంటే ద్వేషం లేదు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు విస్తృత అంశాలపై మాట్లాడారు. వర్క్‌ఫోర్స్‌లో భారతీయ మహిళల తక్కువ భాగస్వామ్యంపై స్పందించారు. భారతదేశంలో మహిళల పట్ల పురుషుల వైఖరి హాస్యాస్పదమని అన్నారు. ఈవైఖరి బిజెపి, ప్రతిపక్షాల మధ్య సైద్ధాంతిక పోరులో భాగమని అన్నారు. బిజెపి /ఆర్ఎస్ఎస్ మహిళలు ఇంటికే పరిమితం కావాలని, వంటిట్లోనే వారి జీవనమని, అధికంగా మాట్లాడకూడదన్న ఆంక్షలు విధిస్తుందని మండిపడ్డారు. మహిళలు తాము కోరుకున్న రంగంలో అభివృద్ధి సాధించాలని తాము కోరుకుంటున్నామని అన్నారు

## దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చిందని తెలిపారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు ఇప్పుడు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు మాకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వండి.. లేదా మాకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. "కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41శాతం నుంచి 50శాతానికి పెంచండి. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నామన్నారు. ఈ డిమాండ్ ను మీరు నెరవేర్చితే.. దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా మార్చాలని ప్రధాని నరేంద్ర మోడీ ఎంచుకున్న లక్ష్య సాధనకు మేం సంపూర్ణంగా సహకరిస్తాం. తెలంగాణను మేం ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణకు తగినంత సహాయం అందించండి. దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మా వంతు బాధ్యతను నేరవేరుస్తామన్నారు. ఫిస్కల్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయడంలో మీ మద్దతు కోరుతున్నామన్నారు. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మీ సిఫారసులు ఉపయోగపడతాయని మేం నమ్ముతున్నాం" అని అన్నారు.

## వరద బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పై విమర్శలు చేయడం సిగ్గుచేటని విజయవాడ సహా జిల్లాలన్నిటిలో వరద బాధితులను నమోదు ప్రక్రియ జరుగుతుంది అని వరద బాధితుల నమోదు ప్రక్రియ కు ప్రత్యేక యాప్ వాడనున్నామని అన్నారు. వరదల్లో దెబ్బతిన్న బైకులు టీవీలు ఫ్రిజ్లు ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ మరమ్మత్తులు చేయించడం సీఎం చంద్రబాబు నాయుడు చొరవ చూపిస్తున్నారని అన్నారు. ప్రకాశం బ్యారేజీ విధ్వంసానికి మాజీ సీఎం వై ఎస్ జగన్ నాయకత్వంలో కుట్ర జరిగిందని ఆమె అన్నారు. ఉద్దండరాయునిపాలెం లో ఉండాల్సిన పడవలు అక్కడికి ఎలా వచ్చాయో విచారణ చేపట్టామని 16 టన్నుల కౌంటర్ వెయిట్ బ్యారేజీ గేట్లకు తగులుతుంటే ప్రమాదాన్ని ఊహించగలమా అని ఆమె అన్నారు. 40 నుంచి 50 టన్నులు బరువున్న మూడు కోట్ల నైలాన్ తాడుతో కడితే ఆగుతాయా అనే ప్రశ్నించారు? జరిగిన ప్రమాదంపై జల వనరులు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టామని ఆ బోట్లకు యజమానులు ఉషాద్రి , కోమటి రామ్మోహన్ అనే వ్యక్తులుగా తేలిందని ఆమె అన్నారు. పడవలకు వైయస్సార్ పార్టీ రంగులు వేయడం పై నిజాలు నెగ్గు తేలుస్తామని ఇసుక బోట్లకు పట్టకుండా నాటి ప్రభుత్వం లో మాజీ ఎంపీ నందిగామ సురేష్ కు సంబంధించిన వారు ఆ రంగులు వేశారని , మాజీ సీఎం కార్యక్రమం సమన్వయకర్త తలసెల రఘురాం పాత్ర ఎంత ఉంది అన్న అంశాలు విచారణలో తేలుతాయని పడవలు ఎవరివి? పడవలు పోయాయి అన్న ఫిర్యాదు రాకపోవడం వెనక కారణాలు ఏమిటన్నది విచారిస్తున్నామని ఆమె అన్నారు ఈ పడవల వల్లే 67 , 68 గేట్లు ధ్వంసం అయ్యాయని ఆమె మరోసారి స్పష్టం చేశారు. అంతేకాకుండా ధ్వంసమైన గేట్లను 45 గంటల్లోనే కౌంటర్ వెయిట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె అన్నారు.

మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కఅష్ణలంక రిటైనింగ్ వాళ్ళు టిడిపి ప్రభుత్వ హయాంలోనే సగం పూర్తయిందని ప్రజల కష్టాలు విని వాటిని పరిష్కరించేందుకే సీఎం క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించారని ప్రతిపక్ష నాయకుడి హౌదా లేని విపక్ష పార్టీ అధినేత జగన్ అలా వచ్చి వెళ్లి బురదజల్లే ప్రయత్నం చేశారని. ఏలేరు వరద ప్రవాహం పై కాకినాడ జిల్లా కలెక్టర్ షన్ మోహన్ తో ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నామని ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఒకేలా ఉండటం వల్ల కొన్నిచోట్ల ముంపు గురైందని అయినా ప్రమాదం ఏమీ లేదని ఆమె అన్నారు . కొల్లేరు బుడమేరు ఏలేరు అన్ని పరీవాహ ప్రాంతాల్లో ఆక్రమణలపై ప్రభుత్వం దఅష్టి పెడుతుందని అన్నారు. తాడేపల్లిలో విపత్తు నిర్వహణ సంస్థలు ఏర్పాటు అయిన సాంకేతిక పరిజ్ఞానానికి కనీసం పైసా ఖర్చు పెట్టకుండా నిర్వీర్యం చేశారని అన్నారు. విశాఖపట్నంలోని తెన్నేటి పార్క్, గోపాలపురం, సీతమ్మధార ప్రాంతాల్లో కొండ చరియలు విరిగి పడకుండా చర్యలు చేపడతామని విచారణ పూర్తయిన అనంతరం నివేదిక తెప్పించుకొని మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

# కాంగ్రెస్‌లో సీనియర్లకు షర్మిల షాక్

(మొదటిపేజీ తరువాయి)

నెగ్గిందని తాజా లిస్టు కోడై కూస్తోంది.

**రాజన్న బిడ్డగా ఏపీ కాంగ్రెస్‌కు జీవం**

రాష్ట్ర విభజన స్వయం కృతంతో ఏపీలో నిర్జీవమైన కాంగ్రెస్‌కు.. రాజన్న బిడ్డగా షర్మిల జీవం పోస్తారనే ఆశలు సార్వ త్రిక ఎన్నికలకు ముందు పార్టీ క్యాడర్‌లో చిగురించాయి. ఆ ఆశతోనే అధిష్ఠానం మాజీ ఎమ్మెల్సీ గిడుగును తప్పించి పీసీసీ సారథ్యం షర్మిల చేతిలో పెట్టింది. అప్పటి వరకు టీ-ఎస్సార్ సీపీసీ.. ఆ పార్టీ అధినేతగా పాదయాత్రల పార్టీగా నడుపుతూ వస్తున్న షర్మిల., ఏపీ కాంగ్రెస్‌లోనూ తిరిగి అదే ట్రెండ్ కొన సాగించారు. పాదయాత్రలకు, రైనీ సీజన్‌కు వింతైన నిర్వచనాలు చెప్పి ఆకట్టుకునే షర్మిల, ఏపీసీసీ సారథిగా తన దైన శైలిలో దూకుడు పెంచారు. ప్రత్యేకించి ఎన్నికల సభల్లో పంచుల మోత మోగించిన ఆమెకు, ఏపీ జనం బ్రహ్మరథమే పట్టారు. స్వయానా సోదరుడైన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఆమె తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పిసీసీ సారథిగా షర్మిల 'హస్తవాసి' పార్టీకి ఎంతో కొంత లాభించింది.



మున్నెన్నడూ లేని స్థాయిలో కాంగ్రెస్ గ్రాఫ్ ఏపీలో అనూహ్యంగా పెరిగింది. అన్నింటా జావగారిన పార్టీ పట్ల జనంలో మమకారం పెరిగింది. కాంగ్రెస్ సభలంటే ఆపై మీడియా అటెన్షన్ మొదలైంది. వివిధ కారణాలతో దూరమైన మైనార్టీ, బడుగు బలహీన వర్గాలు హస్తంకు చేరువయ్యాయి. 'చే'జారిన ఓటు బ్యాంకు తిరిగి దరిచేరే పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికలు ముగిసే నాటికి కాంగ్రెస్‌కు జవజీవాలు ఖాయమనే సూచనలు అప్పట్లో ప్రస్ఫుటంగా కనిపించాయి.

**ఏపీ కాంగ్రెస్‌లో పాత లుకలుకలు:-**

ఎన్నికల పోరు పతాక స్థాయికి చేరే నాటికి పాత వాసన గుప్పుమంది. ఏపీ కాంగ్రెస్‌లో లుకలుకల వ్యవహారాలు మొదలయ్యాయి. తెలుగుదేశం పార్టీకి ఏపీ కాంగ్రెస్ 'బీ' టీమనే ప్రచారం బలంగానే జరిగింది. కాంగ్రెస్ టిక్కెట్ల కేటాయింపు వ్యవహారం ప్రహసనంగా ముగిసింది. పార్టీలోని పాత కాపులకు పాతరేసి, కొత్త మొఖాలను తెరపైకి తెచ్చారనే ప్రచారం క్యాడర్‌లో మొదలైంది. కాంగ్రెస్‌కు ఊపిరి పోయడం కంటే..గొంతు నులిమే 'రహస్య' తంతంగం కొనసాగుతుందని కొందరు సీనియర్లు అధిష్ఠానం వద్ద వాపోయారు. కాంగ్రెస్ సీట్ల కేటాయింపుల ప్రక్రియలో మతలబులు చోటు చేసుకున్నాయనే ప్రచారం గుప్పుమంది. కాంగ్రెస్ బీ..ఫామ్‌లు బీ-టీమ్ తరహాలోనే అమ్ముడు పోయాయనే అపవాదు ఊపందుకుంది. టిక్కెట్ల తంతుపై తగు ఆధారాలతో ఏపీ నుంచి కేంద్ర పార్టీకి ఈ- మెయిళ్ల వరద పారింది. ఒక దశలో మూడున్నర వేలకు పైగా ఆన్‌లైన్ ఫిర్యాదులు అధిష్ఠానానికి చేరినట్టు పార్టీలో అప్పట్లో ప్రచారం జరిగింది. ఢిల్లీ పెద్దలు ఉదాసీనత వీడక పోతే ఏపీలో హస్తం పార్టీ కూకటి వేళ్లు, గల్లంతవుతాయని అసమ్మతి నేతలు బాహటంగానే గళం విప్పారు. అసమ్మతి వాణి టెన్ జనపథ్‌కు చేరేలా.. ధర్నాలు, నిరసనలు చేపట్టి, పార్టీ సారథి వైఖరిని బాహటంగానే ఎండగట్టారు.

**అసమ్మతి గళానికి అన్నింటా ముకుతాడు :-**

అధిష్ఠానం నోరు విప్పక ముందే షర్మిల అసమ్మతి నేతలపై షర్మిల విరుచుకుపడ్డారు. ఏకంగా అనుబంధ కమిటీలన్నీ రద్దు చేసి ఆయా ఆఫీసులకు తాళాలు వేశారు. అసమ్మతీయులకు కుప్పి గంతులకు అవకాశమివ్వకుండా పలు మార్లు జాగ్రత్త పడ్డారు. ఏపీలో అధికార మార్పిడి జరిగే నాటికి కేంద్ర నాయకాత్వానికి ఆమె మరింత చేరువయ్యారు. అధిష్ఠానం తన పక్షమేనని నమ్మించే ఫీట్లతో అసమ్మతి ఎత్తులను విజయవంతంగా చిత్తు చేశారు. వివేకా హత్యను హాట్ టాపిక్‌గా మార్చిన ఆమె ఇంటి గుట్టును సైతం రచ్చకీడ్చే సాహసం చేశారు. పిసీసీ సారథి హెూదాలో ఆమె తన వాడీ, వేడీ డైలాగులతో స్వయానా సోదరుడైన అప్పటి సీఎం జగన్‌కు ముచ్చెమటలు పట్టించారు. స్వంత అన్నను ఓటమి అంచుకు చేర్చేదాక అలుపెరగని శ్రమ చేశారు. వైఎస్ శకం ముగిశాక .. ఏపీలో కాంగ్రెస్ కుదేలుకు కారణ మైన జగన్ ఓటమి, మొత్తం మీద కాంగ్రెస్ అధిష్ఠానానికి కొంత ఉపశమనం కల్గించింది. కాంగ్రెస్ పేలికలతో పెనవేసుకున్న వైసీపీ జెండాను దించే క్రతువును వైఎస్ షర్మిల ఏదో రీతిన పూర్తి చేశారు. అధిష్ఠానం ఆశించే ప్రాజెక్టును ఒక విధంగా విజయవంతంగానే అమలు పర్చారు. తన తండ్రి వైఎస్ మృతి అనంతరం, ఏ..పీసీసీ అధ్యక్షులు చేయలేని మహత్కార్యాన్ని షర్మిల స్వల్ప వ్యవధిలో ముగించారు.

**అధిష్ఠానం మనసెరిగి కార్య సాధన :-**

పార్టీ సారథిగా లక్ష్య సాధనలో కేంద్ర పార్టీ పెద్దలు మెచ్చేలా షర్మిల మసలు కొన్నారు. ఏపీలో కాంగ్రెస్ తునాతునకలకు కారణమైన వైసీపీ పరాభవంలో షర్మిల పాత్రను అధిష్ఠానం బాగానే లెక్కించింది. కాగల కార్యంలో పీసీసీ సారథిగా ఆమె దక్షతను..అంతకు మించి ఆమె సామ ర్థ్యాన్ని తగు రీతిన గుర్తించింది. అందుకు తార్కాణంగానే ప్రస్తుత ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిలిచింది. నూతన కార్యవర్గంలో పీసీసీ సారథిగా షర్మిల అంతా తానై వ్యవహరించారు. తాతల నాటి సీనిరియాటీని కాదని పార్టీకి నిబద్ధులైన వారికే పీసీసీ పదవులు ఇప్పించుకున్నారు. ఏక మొత్తంలో కాంగ్రెస్ కుటుంబం ఒకటే అయినప్పటికీ గ్రూపు రాజకీయాలకు కాంగ్రెస్ పెట్టింది పేరు.

కాంగ్రెస్ ఉద్థాన పతనాల్లో .. గ్రూపు గొడవలదే పై చేయి. పార్టీ కొలువుల్లో, అధికారిక హెూదాల్లో గ్రూపు సమీకరణలే కీలక పాత్ర పోషిస్తాయి. పార్టీకి బలం,బలహీనతల్లో కోటరీలదే అగ్రాసనం. షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి పార్టీ పాత కాపులకు ప్రాధాన్యత తగ్గించుకుంటూ వచ్చారు. గత ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారు మొదలు కొని,టిక్కెట్ల కేటాయింపు వరకు అన్నీ తానై వ్యవహరించారు. సీనియర్లను సైతం కాదని అన్నింటా తన పంతం నెగ్గించుకుంటూ వచ్చారు. కాంగ్రెస్‌లో వైఎస్ రాజకీయ వారసత్వాన్ని కొనసాగింపుగా.. షర్మిల అచ్చంగా తన తండ్రి మాదిరిగానే వ్యవహరించారు. అధిష్ఠానం మనసెరిగి.. లక్ష్యాన్ని సాధించి అన్నింటా తన సమర్థతను చాటుకున్నారు.

**సమర్థ కార్యచరణకే పీసీసీ పగ్గాలు:-**

అశాస్త్రీయ విభజన తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అడ్రస్సును గల్లంతు చేసింది. ప్రస్తుత తెలుగు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులకు ముందు పీసీసీ పీఠం ఎక్కిన కాంగ్రెస్ సీనియర్లు అందరూ కాంగ్రెస్ ఎదుగుదలకు అంటీ ముట్టనట్లుగానే వ్యవహరించారు. తెలంగాణా పీసీసీ పగ్గాలు ప్రస్తుత అక్కడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన తరువాతనే.. అక్కడ కాంగ్రెస్‌కు దశ తిరిగింది. ముఠా కుమ్ములాటలు కాంగ్రెస్‌కు నిలువునా ముంచుతున్న దశలో తెలంగాణా రాష్ట్ర సమితి ( బీఆర్ ఎస్) ఆ రాష్ట్రాన్ని ఏక ఛత్రాధిపత్యంగా ఏలింది. టీ పీసీసీ సారథిగా రేవంత్ రెడ్డి మరింత దూకుడు పెంచి.. అక్కడ కాంగ్రెస్ పూర్వవైభవానికి దోహద పడ్డారు. రేవంత్ ధాటికి 'కారు' కుదేలై షెడ్డుకు చేరే పరిస్థితి రావడంతో.. అదే సూత్రాన్ని కాంగ్రెస్ హై కమాండ్ ఏపీకి వర్తింపచేసింది. తెలంగాణా ప్రయోగం ఫలితాలివ్వడంతో ఏపీసీసీకి షర్మిలను సారథిగా ఎంపిక చేసింది. షర్మిలకు ముందు పీసీసీ సారథ్యం ఏపీలో అలంకార ప్రాయంగానే మిగిలింది. వైసీపీ ఏక ధాటికి పీసీసీ ప్రసిడెంట్లు తాము విపక్షమనే మాటనే అనేక సందర్భాల్లో మర్చారు. ఏపీలో కాంగ్రెస్ ఎదుగుదలకు ఉన్న ద్వారాలన్నింటిని మూసివేసి, పీసీసీ పదవిని కాలక్షేపం కహానీగా మార్చారు. సార్వత్రిక ఎన్నికల వంటి కీలక సమయంలోనే కాంగ్రెస్ అధిష్ఠానం సంచలన నిర్ణయం తీసుకుంది. ఉన్న పళంగా అప్పటి పీసీసీ సారథిని మార్చి ఆ పగ్గాలు షర్మిల చేతికిచ్చింది.

**రాజన్న వారసత్వంతో మింగుడు పడని వైఖరి:-**

రాజన్న వారసత్వాన్ని అందిపుచ్చుకున్న షర్మిల, పీసీసీ సారథిగా తొలి నాటి నుంచి ఎవరికీ మింగుడు పడని వైఖరిని అనుసరిస్తూ వస్తున్నారు. ఆమె తీరు వల్ల పార్టీకి మేలు కంటే కీడే ఎక్కువని వ్యతిరేకులు చేస్తున్న ప్రచారాన్ని ఏ మాత్రం లెక్క చేయడం లేదు. దక్షిణాదిన హస్తం హవా వీస్తున్న దశలో.. ఏపీలో ఒడ్డుకు చేరే కాంగ్రెస్ నావను, బీ..టీమ్ గా మార్చి.. నట్టేట ముంచారనే వ్యతిరేకుల విమర్శలకు ఆమె అస్సలు ఖాతరు చేయడం లేదు. గిట్టని వారు ఎంతగా ఊదర గొట్టినా.. ఆమె అదరక బెదరక అలానే సాగిపోతున్నారు. వ్యతిరేక నిందలు ఆ సాంతం చెరిగేలా ఆమె సమయాను కూలంగా వ్యవహరిస్తున్నారు. అడపా దడపాగా ప్రస్తుత ప్రభుత్వంపై విపక్ష నేత హెూదాలో విమర్శలు ఎక్కుపెడు తూనే ఉన్నారు. తొలినాళ్లలో వైసీపీని చెండాడినంత తీవ్రత లేక పోయినా.. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత చాటే విధంగానే ఆమె వ్యవహరిస్తున్నారు. పీసీసీ సారథిగా పార్టీ ప్రాధాన్యతలకే తనవంతుగా పెద్ద పీట వేస్తున్నారు. ఇదంతా నిశితంగా గమనిస్తున్న పార్టీ హై కమాండ్ షర్మిల పక్షంగానే ఉంటూ వస్తుంది.

**పీసీసీ నూతన కమిటీలో షర్మిల మార్కు:-**

తాజాగా ఏఐసీసీ ఓకే చెప్పిన పీసీసీ కార్యవర్గంలో, షర్మిల తరహా మార్కు స్పష్టంగా కనిపిస్తుంది. గతానికి కంటే భిన్నంగా ప్రజల్లో ఉంటూ .. పార్టీ కోసం పనిచేసే వారికే ప్రాధాన్యత దక్కిందనే ప్రచారం, పార్టీ క్యాడర్‌లో జరుగుతుంది. సీనియర్ నేతల సిఫార్సులతో నిమిత్తం లేకుండానే రాష్ట్ర ఉపాధ్యక్షులతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శుల ఎంపిక జరిగిందనే అభిప్రాయం వ్యక్త మవుతోంది. నగర కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం విషయంలోనూ పార్టీ కోసం పాటు పడే వారికే పదవులు దక్కాయనే భావన అన్నింటా వ్యక్త మవుతోంది. ఇంకా అనేక అనుబంధ విభాగాల నియమాలకు జరగాల్సి ఉండగా.. వాటి కోసం కొందరు నేతలు ఎదురు తెన్నులు చూస్తున్నారు.

వాటి నియామకాల్లో కూడా గతంలో పని చేసిన అనుభవం ఉంటేనే పదవులనే ప్రచారం జరుగుతోంది. పీసీసీ కార్యవర్గానికి మిగిల పదవులకు రెండో జాబితా , షర్మిల కను సన్నల్లోనే.. సిద్ధ మవుతున్నట్లు తెలుస్తోంది. తాజా పీసీసీ కార్యవర్గాన్ని నేడో రేపో సమావేశ పర్చి భవిష్యత్తు కార్యచరణకు పీసీసీ సారథిగా దిశా నిర్దేశం చేయడానికి ఆమె సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం మీద 2029 నాటికి తెలంగాణా తరహాలో ఏపీలో కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చాలని షర్మిల కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకు పార్టీ హై కమాండ్ దన్నుతో షర్మిల పీసీసీ సారథిగా ముందకు సాగనున్నారు. ఇరుగు పొరుగు రాష్ట్రాల కాంగ్రెస్ సారథులు, ఆయా ప్రభుత్వాల కీలక పెద్దల సహకారం షర్మిల సారథ్యానికి, కార్యదక్షతకు, సమర్థ్యానికి అదనపు బలం కానున్నాయి. హైకామాండ్ ఆశీస్సులతో షర్మిల సారథ్యంలోనే.. ఏపీ లో కాంగ్రెస్‌కు నవోదయం తప్పదని పార్టీ క్యాడర్ బలంగా విశ్వసిస్తోంది.

## వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్న సేవలు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పూర్తిగా అందడం లేదని, 10 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ముంపు అలాగే ఉందని తెలిపారు. పూర్తి స్థాయిలో అందరికీ అన్ని రకాల సాయం అందేలా చూడాలని కోరారు. ఈ ప్రకృతి విపత్తులో విజయవాడ నగరంలో ముంపుకు గురైన ప్రతీ కుటుంబానికి సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల రుణాల చెల్లింపులను వాయిదా వేయాలని కోరారు. బుడమేరు ముంపు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల వల్ల నగరానికి నష్టం వాటిల్లకుండా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. వరద వల్ల కృష్ణా జిల్లా, ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో జరిగిన పంట నష్టంపై విచారణ జరిపి అందరినీ ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల ఉపాధి పోయిందని, కౌలు రైతుల పంట దెబ్బతిని నష్టపోయారని, అలాంటి వారందరినీ ఉదారంగా ఆదుకోవాలని సిపిఎం నాయకులు సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

Truth of News
సూర్య
http://www.suryavastavam.in
వాస్తవం

# సంపాదకీయం

## సైబర్ నేరాలకు రోజుకు 14 కోట్లు మాయం..?

దేశంలో సైబర్ నేరాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. ఈ జీ మనీ కోసం కేటుగాళ్లు కాసుకొని కూర్చుంటున్నారు. ప్రతి ప్లాన్ కు వాళ్లదగ్గర వేరే ప్లాన్ రెడీగా ఉంది. సైబర్ నేరాలతో మనం ఎప్పుడు జాగ్రత్త గానే ఉండాలి. ఎవరో తెలీకుండా పిన్ నెంబర్స్ కాని డీటైల్స్ కాని ఇవ్వకూడదు. సైబర్ మోసాల ద్వారా నేరగాళ్లు రోజుకు సుమారు 14 కోట్ల రూపాయలను అమాయకుల నుంచి కొల్లగొడుతున్నారు. అంటే ఏడాదికి సుమారు రూ.5వేల కోట్లను వివిధ పద్ధతుల్లో దోచుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం గత జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు నాలుగు నెలల్లో రూ.1,770 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. గడిచిన ఐదేండ్లలో, ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికి సుమారు 40 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు రూ. 8.6 కోట్లు మోసపోయిన సంఘటన మరువక ముందే హైదరాబాద్‌లో మరో భారీ మోసం బయటపడింది. సైబర్ నేరస్థులు ఓ వృద్ధుడి నుంచి ఏకం గా రూ.13.26 కోట్లను కొల్లగొట్టారు. ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ చిట్కాల పేరిట వచ్చిన మెసేజ్ నమ్మి పెట్టుబడి పెట్టి చివరకు మోసపోయాడు. షేర్లలో పెట్టుబడికి మొదట లాభాలు చూపించిన మోసగాళ్లు. వాటిని ఉపసంహరించుకోడానికి అవకాశం కల్పించారు. బాధితుడు సైబర్ నేరస్థులను పూర్తిగా నమ్మి ఏకంగా రూ.13.26 కోట్లను బదిలీ చేశాడు. ఆ తరువాత ఈ మోసాన్ని గ్రహించాడు. ఇదంతా కొంతమంది వ్యక్తుల కుమ్మక్కుతో ఒక నెట్‌వర్క్‌లా జరిగింది. యూపీఐ మోసాలతో ఇప్పటి వరకు రూ.4 కోట్లు కొల్లగొట్టిన రాజస్థాన్ సైబర్ కేటుగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక వీళ్లంతా హైదరాబాద్ లో ముఠాగా ఏర్పడి బజాజ్ ఎలక్ట్రానిక్స్‌ను టార్గెట్ గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నట్లు తాజాగా సైబరాబాద్ డీసీపీ నరసింహ తెలిపారు. ఇకపోతే ఈ ముఠాలో మొత్తం 13 మంది నిందితులు ఉన్నారని, పైగా ఒక్కొక్కరి దగ్గర రూ.1.72 లక్షల నగదు, 50 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మొదట ఏదైనా ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసేందుకు నగరంలో పలు షోరూంలోకి వెళు తున్నారు. ఇక అక్కడ విలువైన వస్తువులు కొనుగోలు చేశాక, యూపీఐ ద్వారా అమౌంట్ పే చేయడానికి బజాజ్ షోరూమ్ లో క్యూఆర్ కోడ్ ను వాళ్ల గ్యాంగ్ లో చాలా మందికి పంపుతూ ఆ అమౌంట్ ను రిటర్న్ తీసుకుంటున్నారు . ఈ క్రమంలోనే.. ఎలక్ట్రానిక్ వస్తువులు డెలివరీ అయ్యాక.. పొరపాటున వేరే ఖాతాకు ఖాతాకు డబ్బు బదిలీ చేశామంటూ తెలివిగా బ్యాంకుకు ఆశ్రయిస్తున్నారు. అలా చార్జ్ బ్యాక్ ఆప్షన్ ద్వారా తిరిగి డబ్బు పొందుతూ మోసాలకు పాల్పడుతున్నారు. యూపీఐ నుంచి డబ్బు రిటర్న్ రాగానే ...కొన్న కొత్త వస్తువును అమ్మేసి డబ్బు చేసుకుంటున్నారు. ఇలా గత రెండు నెలలుగా ఈ ముఠా 1,125 యూపీఐ ట్రాన్స్‌యాక్షన్స్ చేశారన్నారు. అయితే ఎంత జాగ్రత్త గా ఉన్నా..ఇలాంటి టెక్నికల్ మోసాలను ఆపలేకపోతున్నామంటున్నారు అధికారులు. అసోంలో భారీ ఆర్థిక కుంభకోణం జరిగింది. దిబ్రూఘర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు జల్సాలకు బానిసై ఈజీగా డబ్బు సంపాదించుకోడానికి అడ్డదారులు తొక్కారు. ట్రేడింగ్ స్కాం చేయాలని పథకం పన్నారు. 60 రోజుల్లోగా తమ పెట్టుబడులపై 30శాతం రాబడికి హామీ ఇస్తూ పెట్టుబడిదారులను ప్రలోభపెట్టారు. అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లోని ప్రజల నుంచి రూ. 2,200 కోట్లు కాజేశారు. ఈ డబ్బుతో ఫార్మాస్యూటికల్స్, ప్రొడక్షన్, కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో ఒకరు పెట్టుబడి పెట్టగా, మరొకరు అస్సామీ సినిమాల్లో పెట్టుబడి పెట్టి విలాసవంతమైన జీవితాలను గడిపారుచివరకు పోలీస్‌లకు చిక్కారు. ఇలాంటి సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట బయటపడుతున్నాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ మొబైల్ ఫోన్ అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియాను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇంటర్నెట్‌లో ముఖ్యమంత్రులు, మంత్రు లు, ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి డబ్బులు గుంజుతున్నారు. చాలావరకు ఈ నేరాలు సామాజిక మాధ్యమాల ద్వారానే జరుగుతుంటాయి. సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయాలు, కొన్ని ప్రకటనల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చన్న దురాశే ఈ నేరాలకు దారి తీస్తోంది. సాధారణంగా మనకు తెలియని విషయం ఏదైనా ఉందంటే దానిపై ఆసక్తితో తెలిసిన వారి సూచనలు తీసుకుంటాం. ముఖ్యంగా పెట్టుబడి వంటి ఆర్థిక సంబంధిత విషయాలైతే కచ్చితంగా అనుభవం ఉన్న వారి సలహాలు తీసుకుంటాం. ఈ పరిస్థితినే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మనకు పెట్టుబడుల్లో సాయం చేస్తున్నట్టు నటించి మన సొమ్ము కాజేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఉచిత స్టాక్ చిట్కాలు, సలహాలపై ప్రకటనలు విడుదల చేసి పెట్టుబడిదారులను ఆకర్షిస్తుంటారు. వివిధ క్లయింట్లు సంపాదించిన లాభాల తాలూకు నకిలీ స్క్రీన్ షాట్‌లను విడుదల చేసి నమ్మిస్తుంటారు. పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి ఆకర్షితులైతే ఆపరేటర్లు మొదట్లో డబ్బును మోసపూరిత వ్యక్తి తాలూకు బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ విధంగా నమ్మించి తమ ప్రీమియం, విఐపి ఛానెళ్లకు సభ్యత్వాన్ని పొందాలని ఒత్తిడి చేస్తారు. తద్వారా మరిన్ని ఎక్కువ లాభాలు వస్తాయని హామీ ఇస్తుంటారు. బాధితులు ఒకసారి ప్రలోభాలకు గురైన తరువాత వారి బ్యాంకు ఖాతాల్లోకి పెద్ద మొత్తంలో నిధులను బదిలీ చేయాలని అడుగుతుంటారు. వెబ్‌సైట్‌లో ప్రదర్శించే నకిలీ లాభాలను ఉపసంహరించుకోడానికి పెట్టుబడిదారులు ప్రయత్నించినప్పుడు, ఉపసంహరణ ఎంపిక బ్లాక్ చేయడంతో వారు షాక్‌కు గురవుతారు. ఎంపికను అన్‌బ్లాక్ చేయడానికి స్కామ్‌స్టర్లు పన్నులు, పెనాల్టీలతో సహా వివిధ కారణాలను పేర్కొంటూ తదుపరి డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తారు. భారీగా మొత్తాన్ని సేకరించిన తరువాత స్కామ్‌స్టర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంటారు. సైబర్ నేరగాళ్లు బెదిరింపులు కూడా చేస్తుంటారు. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మీ బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అయిందని, ఎఫ్‌ఐఆర్ కూడా నమోదైందని, వాట్సాప్‌లో హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఆ నేరంతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినా వినకుండా అదే పనిగా బెదిరిస్తుంటారు. తాజాగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ పేరునే ఉపయోగించి తాను సిజెఐని అని క్యాబ్ కోసం తనకు రూ. 500 పంపాలని హెచ్చరిస్తూ మెసేజ్ కూడా వచ్చింది. ఈ విధంగా వివిధ రకాలుగా ఈ ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ నేరాలు సాగుతున్నాయి. ఇలాంటి కేసులు పెరిగిపోతుండడంతో హైదరాబాద్‌లోని క్రైమ్స్ అండ్ సిట్ అధికారులు కొన్ని హెచ్చరికలను చేశారు. మార్కెట్ రెగ్యులేటరీ సెబీలో రిజిస్టర్ చేసినవి కాకుండా తెలియని అప్లికేషన్లలో స్టాక్ మార్కెట్ చేయవద్దు. అలాగే అవతలి వ్యక్తుల మాటలను నమ్మి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు డబ్బును బదిలీ చేయరాదు. మోసగాళ్లు అందించే సందేహాస్పదమైన రాబడిని నమ్మవద్దు. మీ డిమ్యాట్ ఖాతా ఆధారాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దు. గూగుల్ ప్లేస్టోర్ లేదా వారి స్వంత వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసేటప్పుడు అప్లికేషన్ల ప్రామాణికత నిర్ధారించుకోవాలి' అని క్రైమ్ విభాగం హెచ్చరికలు చేసింది. ఈ విషయంలో సెబీ యంత్రాంగం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరం.

# 5 రోజుల్లో మరమ్మతులు పూర్తి

**విజయవాడ-సూర్య వాస్తవం**

ప్రకాశం బ్యారేజీ వద్ద ఇటీవల వరదల సమయంలో దెబ్బతిన్న గేట్ల మరమ్మతులు పూర్తి చేసింది ఏపీ ప్రభుత్వం. బోట్లు ఢీకొట్టడంతో గత వారం 67, 69, 70 గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది విజయవంతంగా కౌంటర్ వెయిట్ల మరమ్మతులను పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్ల స్థానంలో స్టీల్ తో పటిష్టంగా తయారు చేసిన భారీ కౌంటర్ వెయిట్లను ఇంజినీర్లు విజయవంతంగా ఏర్పాటు చేశారు. కేవలం 5 రోజులలోపే ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న మూడు గేట్లు 67, 69, 70 వద్ద ఇంజనీర్లు, అధికారులు భారీ కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఇంజనీర్, నిపుణుడు కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో తక్కువ సమయంలోనే బ్యారేజీ వద్ద దెబ్బతిన్న గేట్లకు కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేశారు. బెకెమ్ ఇన్ ఫ్రా సంస్థ ఈ గేట్ల మరమ్మతులు చేపట్టి పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రంగంలోకి దిగి.. రేయింబవళ్లు పనిచేసిన సిబ్బంది, ఇంజినీర్లు, అధికారులను కన్నయ్యనాయుడు సన్మానించారు. తమకు విలువైన సూచనలు ఇస్తూ మార్గనిర్దేశం చేసిన కన్నయ్యనాయుడిని సైతం ఇంజినీర్లు, అధికారులు సన్మానించారు.



**ఇంకో 20 ఏళ్లే ప్రకాశం బ్యారేజ్ లైఫ్**

దాదాపు పదకొండున్నర లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద ఉద్ధృతిని తట్టుకున్న ప్రకాశం బ్యారేజ్ ఉండేది మరో 20 సంవత్సరాలేనా? త్వరలోనే మరో కొత్త ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం రూపకల్పన చేయక తప్పదా అంటే అవుననే అంటున్నారు రిటైర్డు ఇంజనీర్ ప్రముఖ జలవనరుల సాంకేతిక సలహాదారు కన్నయ్య నాయుడు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వాటి పనితీరుకు సంబంధించిన టెక్నికల్ నాలెడ్జ్‌లో దేశవ్యాప్తంగా పేరుపొందారు ఇంజనీర్ కన్నయ్య నాయుడు. ఇటీవలే తుంగభద్ర ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోయిన సమయంలో దానికి స్టాప్ లాగ్ ఏర్పాటు చేసి ప్రాజెక్టు కాపాడిన ఘనుడాయన. దానితో ఆయన్ను ఏపీ జలవనరుల శాఖ మెకానిక్ విభాగ సలహాదారు గా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం వరదలకు కృష్ణా నదిలో కొట్టుకు వచ్చిన బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజ్‌లోని 67, 69, 70 గేట్లపైన ఉన్న కౌంటర్ వెయిట్ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. వాటిని మార్చే పనిలో అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు కన్నయ్య నాయుడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకట్రెండు రోజుల్లో పాత కాంక్రీట్ కౌంటర్ వెయిట్ నిర్మాణాల ప్లేస్‌లో కొత్త మెటల్ కౌంటర్ వెయిట్ నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. బోట్లు ఢీ కొట్టడం వల్ల ప్రకాశం బ్యారేజ్ దెబ్బ తినలేదని చెబుతూనే దాని లైఫ్ టైం మాత్రం మరో 20 ఏళ్లు అని తెలిపారు. అదే నిజమైతే త్వరలోనే మరో కొత్త ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు మొదలెట్టాల్సిందే అన్న చర్చ మొదలైం. దిభీకర వరదలను తట్టుకుని విజయవాడ సహా మొత్తం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలను కాపాడింది ప్రకాశం బ్యారేజ్. ఇటీవల చరిత్రలో ఎన్నడూ లేనంత వర్షాన్ని చూసింది విజయవాడ. దానితోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు కూడా కృష్ణలో చేరడంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద వందేళ్ల తర్వాత పదకొండున్నర లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. దానితో ఏక్షణం ఏం జరుగుతుందో అన్న భయం అందరిలో నెలకొంది. కానీ అంతటి ప్రవాహాన్ని సైతం తట్టుకుని నిలబడింది ప్రకాశం బ్యారేజ్. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగుంటే కేవలం బుడమేరు అనే పెద్ద వాగు పొంగినందుకే సగం మునిగిపోయిన బెజవాడ... కృష్ణ కూడా అదుపు తప్పితే తట్టుకునే స్థితిలో లేకపోయేది. అయితే ఈ చిన్న బ్యారేజ్ అంత పెద్ద వరదనూ సమర్థవంతంగా తట్టుకుని పెద్ద విలయాన్ని తప్పించింది. కానీ ఈ టైంలో దాని జీవితకాలం మరో దాదాపు ఇరవై ఏళ్ళు మాత్రమే అని తేలింది. 1832 ప్రాంతాల్లో డొక్కల కరవు గుంటూరు, విజయవాడ ప్రాంతాల్ని పీడించింది. పంటలకు నీరు లేక జనం అల్లాడి పోయారు. తిండి లేక చనిపోయిన వారి సంఖ్య లక్షల్లోనే. దానితో కృష్ణలో నీటిని నిలువ చేసుకునేలా ఒక బ్యారేజ్‌ను విజయవాడ వద్ద నిర్మించాలని బ్రిటీష్ ప్రభుత్వం భావించింది. ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ దొర కూడా ఇదే సూచించారు. ఈ ప్రాజెక్ట్ 1853లో ప్రారంభమై 1854లో పూర్తైంది. కాటన్ శిష్యుడు మేజర్ చార్లెస్ ఓర్ ఈ నిర్మాణాన్ని పర్యవేక్షించారు. దాని పొడవు 1132 మీటర్లు. దానికి పెట్టిన ఖర్చు 1.49 కోట్ల రూపాయలు. వందేళ్ళపాటు సేవలందించిన ఈ బ్యారేజ్ 1952లో వరదలకు కొట్టుకుపోయింది బ్రిటీష్ వాళ్ళు కట్టిన బ్యారేజ్ కొట్టుకుపోవడంతో ఆ ప్లేస్‌కు కొంత ఎగువన కొత్త ప్రాజెక్ట్ కట్టడానికి అప్పటి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం 1954లో ఫిబ్రవరి 13న పనులు ప్రారంభించింది. ఈ నిర్మాణం నాలుగేళ్ల పాటు సాగి 1957 డిసెంబర్ 24 న ప్రాజెక్ట్ రెడీ అయ్యింది. దీని నిర్మాణానికి 2.78 కోట్లు ఖర్చయిందని రికార్డ్స్ చెబుతున్నాయి. దీని పొడవు 1223 మీటర్లు. కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ నీరు అందిస్తుంది. అప్పటి నుంచి అవిశ్రాంతంగా పనిచేస్తూ ఎన్నో వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రకాశం బ్యారేజ్ మరో 20ఏళ్ల పాటు ఉపయోగపడుతుంది అని కన్నయ్య నాయుడు తెలిపారు.

# దువ్వాడ షాకింగ్ డెసిషన్

**శ్రీకాకుళం-సూర్య వాస్తవం**





ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీ ఎపిసోడ్లో కీలక ట్విస్ట్. ఎమ్మెల్సీ దువ్వాడ, ఆయన సన్నిహితురాలు మాధురి, భార్య దువ్వాడ వాణి మధ్య సాగుతున్న ట్రయాంగిల్ స్టోరీ మరో మలుపు తిరిగింది. మాధురితో తాను నివాసం ఉంటున్న ఇంటి విషయంలో భార్య దువ్వాడ వాణి, పిల్లల నుంచి ఎదురవుతున్న అభ్యంతరాల నేపథ్యంలో శ్రీనివాస్ నోరు విప్పారు. ఆ ఇంటి విషయంలో ఏం జరిగిందో వివరించే ప్రయత్నం చేశారు. మీడియా సమక్షంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కు సన్నిహితురాలు మాధురి ఫోన్ చేశారు. ఫోన్లోనే ఆమెకు ఇంటిపై దువ్వాడ క్లారిటీ ఇచ్చారు. మాధురికి తాను రెండు కోట్లు అప్పుగా ఉన్నానని.. ఇంటి నిర్మాణంతో పాటు రాజకీయ అవసరాల కోసం ఆ డబ్బు వాడుకున్నట్లు చెప్పుకొచ్చారు. చింతాడ పార్వతీశం అనే వ్యక్తికి సైతం60 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. అందుకే తన కొత్త ఇల్లు మాధురికి చెందుతుందని సంకేతాలు ఇచ్చారు దువ్వాడ. ఇప్పటికే రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు చెప్పుకొచ్చారు. దీంతో ఈ వివాదం యు టర్న్ తీసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన వ్యాపారాలు



దెబ్బతిన్నాయని దువ్వాడ శ్రీనివాస్ చెబుతున్నారు. గత ఐదేళ్లుగా దువ్వాడ దూకుడుగా ఉండేవారు. ఎమ్మెల్సీ పదవితో పాటు టెక్కలి ఇన్చార్జిగా ఉంటూ కింజరాపు కుటుంబానికి తరచూ సవాల్ చేసేవారు. రాజకీయాల్లో ఉంటూనే క్వారీ వ్యాపారాలు నడిపేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో ఆ వ్యాపారాలన్నీ మూత పడినట్లు చెబుతున్నారు. తనకు కేవలం ఈ ఇల్లు మాత్రమే ఆస్తిగా ఉందని చెప్పుకొస్తున్నారు. ఇప్పుడు ఆ ఇంటిని కూడా అప్పు కింద ఇచ్చేసినట్లు సంకీర్తన పంపించారు దువ్వాడ. మరోవైపు తన ఆస్తి అని చెబుతున్న ఇంటిలో దువ్వాడ వాణికి ప్రవేశం లేదని మాధురి తేల్చి చెప్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ ఇంటిని కబ్జా చేసేందుకు వాణి ప్రయత్నం చేశారని మాధురి ఆరోపిస్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ తో మాట్లాడిన ఫోన్ సంభాషణలీకేజీలో వాణి సూత్రధారి అని ఆరోపించారు. ఏఐ వాయిస్ రికార్డ్ ప్లాన్ చేసినట్లు చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆ దంపతుల మధ్య విభేదాలు ఉన్న విషయాన్ని మాధురి ప్రస్తావిస్తున్నారు. అయితే ఇంటి విషయంలో దువ్వాడ శ్రీనివాస్ క్లారిటీ ఇవ్వడంతో.. దువ్వాడ వాణి, ఆమె పిల్లలు ఇంటిని ఖాళీ చేశారు. మాధురి ఆ ఇంటిని స్వాధీనం చేసుకున్నారు. ఇంకోవైపు అదే ఇంటిని పార్టీ కార్యక్రమాల నిర్వహణకు దువ్వాడ శ్రీనివాస్ కు అద్దెకు ఇస్తానని మాధురి ప్రకటించారు. మొత్తానికైతే ఈ వివాదం కొత్త మలుపు తిరిగినట్లు అయింది. ప్రెస్ మీట్ పెట్టి మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దువ్వాడ శ్రీనివాస్ ప్రకటించడం విశేషం.

## ఎర్ర చెరువు అలుగు, కట్ట పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచండి: ఏవి.రమణ



మైదుకూరు -సూర్య వాస్తవం: మైదుకూరు పట్టణ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఎర్ర చెరువు, తాగు, సాగునీటి చెరువు పరి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవి.రమణ మైదుకూరు పట్టణ నాయకులు మూలే రామాంజనేయ రెడ్డి మైదుకూరు మునిసిపల్ అధికారులను ఎర్ర చెరువు వేదికగా మీడియా ముఖంగా కోరారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మైదుకూరు పట్టణానికి కిలోమీటర్ దూరముననే ఎర్ర చెరువు ఉన్నందున మైదుకూరు పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ చేస్తా ఉంటారని అలాగే అవకాశం ఉన్న ప్రజలు వారి కుటుంబ సభ్యులతో కలిసి చెరువు ప్రాంతంలో కొంత సమయం కేటాయించి అవకాశం ఉందని అయితే ప్రజలు పరిశుభ్రంగా ఉన్న అలుగు మీదనే మలవిసర్జన చేయడం, అలాగే మందుబాబులు వారు మద్యం సేవించేందుకు వినియోగించుకుని ప్రాంతాలను మందు సీసాల ముక్కలతో గలిజమయం చేస్తూ న్నారు ఈ పరిస్థితి నుండి మైదుకూరు మున్సిపల్ అధికారులు ఎర్ర చెరువును తమ పరివేక్షణలో ఉంచుకొని మునిసిపల్ ఉద్యోగిని చెరువుకు రక్షణగా ఏర్పాటుచేసి చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని రైతు నాయకులు కోరారు.

## చిరు వ్యాపారి దాతృత్వం..!

**- 4 సంవత్సరాలుగా అన్నదానం మానవ సేవే మాధవ సేవ**

**-దుప్పట్లు, ప్లేటు, బాక్స్ అందిస్తున్న కూరగాయల రాముడు**





దువ్వూరు– సూర్య వాస్తవం : తల్లిదండ్రుల పోషణేభారం అనుకునే ఈరోజుల్లో సమాజ సేవే పరమావధిగా భావించి ఒక సాధారణ చిరు వ్యాపారం చేసుకునే చిన్న ముగివాళ్ళ రాముడు మూడేళ్లుగా నిరంతరాయంగా 100 నుండి150 మంది సాధువులకు సంగటిముద్ద అనే మహత్తర కార్యక్రమాన్ని దువ్వూరు పట్టణం నందు ప్రారంభించి ప్రతి మంగళవారం మధ్యాహ్నం పూట బిక్షాటన చేసే సాధువులకు, దివ్యాంగులకు, ఒక పూట కడుపు నింపడం అందరి ప్రశంసలు పొందుతు న్నారు. ఈ ప్రయత్నంలో బాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినంద నీయం. ఈ కార్యక్రమం ద్వారా నిరాశ్రయులకు దుప్పట్లు ప్లేట్ లు,ఆహారపుబాక్స్‌లు అందిస్తూ తన ఉదార గుణాన్ని చాటుతూ పలువురికి ఆదర్శవంతంగా నిలుస్తున్న కూరగాయల రాముడుని పలువురు అభినందిస్తున్నారు. ఇతను ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం 150 మంది సాధువులకు,దివ్యంగులకి, గర్భవతులకు, వాహనదారులకు, బాటసారులకు చంటి పిల్లల తల్లులకు ఒక పూట ఆకలి తీర్చ గలిగినందుకు సంతోషిస్తు న్నారని పలువురు మెచ్చు కుంటూన్నారు. ఎవరిదైనా పుట్టినరోజు పెళ్లి రోజు ఒంటి కార్యక్రమాలకు అన్నదానం చేయాలనుకుంటే మన దువ్వూరులో సేవ చేయదలచిన వారు రాముడుని సంప్రదించగలరు.

## విశాఖ ఉక్కును ప్రవేటి కరణ చేయవద్దు, ఆంధ్రుల హక్కును కించపరిచవద్దు



రైల్వే కోడూరు -సూర్య వాస్తవం: విశాఖపట్నంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయవద్దని రైల్వేకోడూరుకు చెందిన కార్మిక సంఘాలు రాస్తారోకోను నిర్వహించాయి. ఈ సందర్భంగా టోల్గేట్ వద్ద ఉన్న ప్రధాన రహదారిలో దాదాపు అరగంట పాటు ట్రాఫిక్ లో ఆపివేసి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ భారీ నినాదాలను చేపట్టారు. అదేవిధంగా ప్రధానమంత్రి పథకం ప్రకారమే ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో ఉన్నారని ఆయన దానిని ఉపసంహరించుకుని ఆంధ్రుల హక్కును కాపాడాలని వారు అన్నారు. అత్యంత ప్రసిద్ధిగాంచిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలు చేస్తామని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పై సక్రమమైన తీర్మానాన్ని చేపట్టాలని ఆంధ్రుల మనోభావాలను దెబ్బతినకుండా కాపాడాలన్నారు.ఈ కార్యక్రమంలో పందు గోల మణి, రాధాకృష్ణ, దార్ల రాజశేఖర్ తోపాటు ఏ ఐటియుసికి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో వేగంగా మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యత్వాలు



బంగారుపాళ్యం -సూర్య వాస్తవం : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలానికి చెందిన ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్ మంగళవారం కుప్పం డివిజన్ నందు డాక్టర్స్ పారామెడికల్ సిబ్బంది ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నందు సభ్యత్వాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్, జాయింట్ సెక్రటరీ మాధవన్ సిహెచ్ఓ వెంకటేశ్వర రాజు పాల్గొనడం జరిగింది.

## వినాయక మండపాలను.. సందర్శించిన వైసీపీ నాయకులు

**- ఎన్జీవో కాలనీలో వినాయకుడిని దర్శించుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్బాషా, వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ**



కడప బ్యూరో -సూర్యవాస్తవం: నగరంలోని వినాయక మండపాలను మంగళవారం వైసీపీ నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్జీవో కాలనీలో ఏర్పాటు వినాయకుడిని కడప ఎంపీ వై.ఎస్ అవినాష్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు పూజలు చేసి అర్చకులతో ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి మండపాలను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జనంలో అపశృతి జరగకుండా యువకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భక్తిభావంతో వినాయకుడిని నిమజ్జనంలో పాల్గొనాలన్నారు. గణనాధ ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ వినాయక చవితి ఉత్సవ కమిటీ చైర్మన్ అందూరి రాజగోపాల్ రెడ్డి, సభ్యులు ఎం. మధుసూదన్ రెడ్డి, డైమండ్ బాలక్రిష్ణ, నందిమంబు వెంకటసుబ్బయ్య, కార్పోరేటర్ మల్లికార్జున, ఎ. వెంకటేశ్వర్లు, పవన్, హేమంత్, సాయి మహేష్, ఎం.శ్రీనివాసులురెడ్డి, శేషాద్రి, ఉదయ్ కుమార్ రెడ్డి, తదితరులు ఉత్సవాల విజయవంతానికి కృషి చేస్తున్నారు.

## ఉద్యాన పంటలను యాజమాన్య పద్ధతుల ద్వారా మంచి దిగుబడి

**- శాస్త్రవేత్తలు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ విద్యారాణి,డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్**



దువ్వూరు– సూర్య వాస్తవం : రైతులు ఉద్యానవన పంటలను యాజమాన్యం పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ శ్రీ విద్యరాణి, డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ లు పేర్కొన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం, ఒనిపెంటలో ఉద్యాన పంటలలో యాజమాన్య పద్ధతుల పైని ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం డా. ఎమ్. బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్తి , అధిపతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా మిరపలో సమగ్ర పోషక యాజమాన్యం పైన సవివరంగా చర్చించారు. సేంద్రియ ఎరువుల ఆవశ్యకత, పచ్చిరొట్ట ఎరువుల, జీవ రసాయన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. డా శ్రీవిద్యరాణి. ఎన్ హేపీ సమగ్ర సస్యరక్షణ చర్యలపైన వివీరించారు. డా.ఎన్. ఫిరోజ్ హుస్సెన్, శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం. మిరపలో మేలైన యాజమాన్య పద్ధతులు, మిరప రకాల, చీడ పేదల యాజమాన్యం పైన వివరించారు. డా.బి.ఎన్ కాంతిశ్రీ, శాస్త్ర వేత్త, గృహ విజ్ఞాన విభాగం.మిరపలో విలువ ఆధారిత పదార్థాలపైన సవివరంగా తెలియచేశారు. చైతన్య , టెక్నికల్ ఆఫీసర్, వాటర్ షెడ్ డెవెలప్మీం మేనేజ్ మెండ్ బోర్డ్ బద్వేల్ ఈ శిక్షణా కార్యక్రమం రైతు సోదరులకు ఎంతో ఉపయోగపడిందని, మరిన్ని పంటలపై ఇదే తరహంతో శిక్షణ అమలు చేయాలని సభాముఖంగా తెలియ చేశారు. వనిపెంట ఎఫ్‌పిఓచైర్మన్ బాలనర సింహా రెడ్డిమిరపలో ఆశించే తామార పురుగులు నివారణపై ఈ శిక్షణ ఉపయోగపడిందని, తెలియ చేశారు. డా. ఎమ్. బాలకృష్ణ, సీనియర్ శాస్త్ర వేత్తి చేతుల మీదుగా మిరప సాగు పద్ధతులపై చేసిన బుకేటెడ్‌ని రైతులకి అందించారు. అలాగే ఉల్లి సాగుపై శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలియచేశారు. మంగళవారం నుండి శనివారం వరకు శిక్షణ తరగతులు ఉంటాయి శాస్త్రవేత్తలు తెలిపారు. కావునా రైతు సోదరులు వివిధ గ్రామాల నుంచి శిక్షణ తరగతులలో పాల్గొనవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి 50 మంది రైతు సోదరులు హాజరయ్యారు.



## అయ్యా మహాప్రభో బురద నీరు త్రాగలేకున్నాం

**- అధికారులూ మా మొర ఆలకించండి**



రైల్వే కోడూరు -సూర్య వాస్తవం: రైల్వే కోడూరు మండలంలోని గంగరాజు పోడు ఎస్టి కాలనీలో దాదాపు 150 కుటుంబాలు జీవనాన్ని సాగిస్తున్నాయి. అయితే ఈ మధ్యకాలంలో బోరు చెడిపోయి నీరు రాక త్రాగునీటికి పలు రకాల కష్టాలను చవిచూచినట్లు గిరిజనులు విలేకరుల వద్ద వాపోయారు. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని త్రాగునీటికి పలు రకాల ఇక్కట్లకు గురికాగా ఎట్టకేలకు గత రెండు రోజుల క్రితం త్రాగునీటి మోటర్‌ను బిగించగా అప్పటినుండి ఆ బోరులో కలుషిత నీరు రావడం అవి తాగి ఆసుపత్రి పాలు కావడం పరిపాటిగా మారిపోయింది అని గంగరాజుపురం ఎస్టి కాలనీ వాసులు ఆవేదన వెలుబుచ్చారు. అదేవిధంగా ఈ విషయాన్ని పలు రకాలుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టినట్లు వ్యవహ రించడం ఆందోళన కరమైన విషయమని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులను దృష్ట్యా మురుగునీరు తాగిన మరుక్షణమే వాంతులు విరేచనాలు కావడం పూర్తిగా ఆసుపత్రి దూరంగా ఉండడం అక్కడనుండి పట్టణానికి రావాలంటే పలు రకాల ఇక్కట్లకు గురవుతున్నామని గిరిజనుల గోడును పట్టించుకునే నాధుడే లేడా అని వారు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎంపీడీవో లేదా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చొరవచూపి బోరు నుండి వస్తున్న మట్టి నీటిని అరికట్టాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

## పీహెచ్ సి వైద్యుల సమ్మె బాట

**- మండల ప్రభుత్వ వైద్యాధికారులు**




దువ్వూరు– సూర్య వాస్తవం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు మంగళవారం నుంచి సమ్మె బాటపట్టనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాల మేరకు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్ బాబు, హేమలత, వికసిత, రోషిణి లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జీఓ 85కు వ్యతిరేకంగా సమ్మెబాట పట్టామని పేర్కొన్నారు. ఈ జీఓ ద్వారా తమ మూడేళ్లసర్వీస్ అర్థం లేకుండా పోతుందని, ఇలా అకస్మాత్తుగా జీఓ మార్చటం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు నెలలుగా జీఓ 85నురద్దు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు అర్జీలు సమర్పించినా సమాధానం రాలేదని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో జీవితాలను ఫణంగా పెట్టి సేవలు అందించినప్పటికీ జీఓ 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించటంఅన్యాయమని వివరించారు. ముఖ్యంగా ఈజీఓ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలనుప్రభావితం చేస్తుందన్నారు. ఈ నెల 16వ తేదీవరకు వివిధ రీతుల్లో నిరసన తెలుపుతామనిపేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక నిరాహారదీక్షలు ప్రారంభిస్తామన్నారు.



## పామిడిలో విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

**పామిడి-సూర్య వాస్తవం:** పామిడి మండలంలో వెంగమ నాయుడు కాలనీకి చెందిన రవి 25 అనే భవన నిర్మాణ కార్మికుడు జెడ్పి. పి. హైస్కూల్‌లో విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మరమ్మత్తులు చేయిస్తాం పామిడి ఇంచార్జ్



**పామిడి రూరల్ -సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాల్యం తాండ గ్రామపంచాయతీ నందు ఉన్న పంట పొలాలకు వెళ్లే ప్రధాన రహదారి భారీగా నీరు రావడంతో ఎక్కడికక్కడ వరద ప్రభావానికి కొట్టుకొని పోవడం జరిగింది. విషయం తెలుసుకున్న గుంతకల్ నియోజకవర్గ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు పామిడి మండల సమన్వయకర్త ఆర్. ఆర్ రమేష్, హెచ్ ఎల్ సి. ఈ ఈ హెచ్ ఎల్ సి. డి ఈ హెచ్ ఎల్ సి. జే ఈ అధికారులు వచ్చి ఈరోజు ఆ ప్రాంతాల్ని పర్యవేక్షించి పనులు వెంటనే అమలు చేయాలని అధికారులకు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్యం తాండ మాజీ జెడ్పిటిసి రాజేష్ నాయక్. మాజీ సర్పంచ్ రమేష్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రైతులు పాల్గొన్నారు...

## పశు వైద్యశాల డాక్టర్ అనుమతులు ఉండాలి

### - సిపిఎం మల్లేష్



**పామిడి -సూర్య వాస్తవం :**

ఆరోగ్యకరమైన పొట్టేళ్లను, దున్నలను, తదితర జంతువులను మాత్రమే వధించాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ పశు వైద్యశాలలో డాక్టర్ ఉషాకిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ...పామిడి గ్రామపంచాయతీలోని మార్కెట్లలో ఆరోగ్యకరమైన పొట్టేల్లు, ఎద్దులు, దున్నలు మాత్రమే వధించాలని పశువుల డాక్టర్ అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే వధించాలి కానీ కొన్నిచోట్ల అనారోగ్యంతో ఉండే జంతువులను వధిస్తున్నారని, వాటి మాంసం తినడం వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారన్నారు. వీటిపైన పశు వైద్యశాల డాక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాబు, వెంకటేశు, ముత్యాలు, సూరి, నాగరాజు, షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న 12వవార్డ్ కౌన్సిలర్



**హిందూపురం టౌన్ -సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీలో (12 వార్డ్) వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా స్థానిక 12వ వార్డ్ కౌన్సిలర్ రహమత్ బీఎంతో దృఢ సంకల్పంతో వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించారు, భక్తాదుల సమక్షంలో వినాయక ఉత్సవాల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు ఈ సందర్భంగా వినాయక సేవా సమితి సభ్యులు చే కౌన్సిలర్ రహమత్ కి పండ్లు ఫలాలు అందించి ఘనంగా సన్మానం చేశారు, రహమద్ బీ భక్తాదుల సమక్షంలో ఉత్సవాల్లో పాల్గొని సంతృప్తిని వ్యక్తం చేశారు.

# ఆసుపత్రుల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారిద్దాం

**- ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు**




**అనంతపురం వైద్యం- సూర్య వాస్తవం:**

ఆసుపత్రుల ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ కోసం కమిటీని ఏర్పాటు చేసి ఆసుపత్రిలోని అందరి డాక్టర్లకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లకు, నర్సులకు, హౌస్ సర్జన్లకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, మెడికల్ సిబ్బందికి, శానిటేషన్ సిబ్బందికి ఈనెల పది నుంచి 13వ తేదీ వరకు మెడికల్ కళాశాలలోని సుశ్రుత హాలులో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని లాంఛ నంగా మెడికల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ నవీన్‌కుమార్ తో పాటు ప్రారంభించిన తర్వాత సర్వజన ఆసుపత్రి వైద్య పర్యవేక్షకులు డాక్టర్ కె ఎస్ ఎస్ వేంకటేశ్వర రావు గారు మాట్లాడుతూ ఆసుపత్రుల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి అధ్యయనం చేయడానికి, వ్యాధులను నిర్ధారించడానికి, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, రోగ రహిత ఆసుపత్రులను అభివృద్ధి పరచడానికి హాస్పిటల్ అక్వైర్డ్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేసి భారత దేశ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని వైద్య విద్యా సంచాలకులు ఇచ్చిన మార్గ నిర్దేశాను సారము ఆసుపత్రిలో అన్ని నివారణ పద్ధతులను ప్రామాణికంగా పాటించి వ్యాధులను అదుపు చేయనున్నామని, ఈ ట్రైనింగ్‌లో ప్రతి ఒక్కరు వారి యొక్క సందేహాలను బాగా అనుభవం ఉన్న ప్రొఫెసర్లతో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ బి శాంతిరెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్, సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్ హైమావతి, డాక్టర్ రోషన్ షాబ్, డాక్టర్ జగదీశాచార్యులు, డాక్టర్ ఏ గీతాంజలి, డాక్టర్ సరోజ, డాక్టర్ శైలజ, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు నాలుగు రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నారని డాక్టర్ కె ఎస్ ఎస్ వేంకటేశ్వర రావు తెలిపారు.

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**
**- నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**అనంతపురం -సూర్య వాస్తవం :**

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ వద్దనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని సిటీ స్కాన్, పారామెడికల్ విభాగం, కంప్యూటర్ గది, వైద్యుల గది, కన్సోల్ గది, సిఎస్ఎస్డి, ప్రయోగశాల, రక్తనిధి, పరిపాలన విభాగం, అత్యవసర చికిత్స గది, కాత్ లాబ్, ఐసియు, కార్డియాలజీ విభాగం, నాడీ శస్త్ర చికిత్స విభాగం, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, సెమినార్ హాల్, మూత్ర వ్యాధుల శస్త్ర చికిత్స, జీర్ణ కోశ శస్త్ర చికిత్స విభాగం, తదితర అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల కుటుంబ సభ్యులతో వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. వైద్య సేవలు బాగున్నాయా, తాగునీరు అందిస్తున్నారా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకోగా, వైద్య సేవలు బాగా అందిస్తున్నారని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలను రోగులకు అందించాలని సూచించారు. రోగుల కుటుంబ సభ్యులకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ ఖాళీలు ఉంటే వారి నియామకానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు తొందరగా వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ను వేరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డా.సుబ్రహ్మణ్యం, అనస్థీషియా హెచ్ఓడి నవీన్, కార్డియాలజీ ఆర్ఎంవో సుభాష్ చంద్రబోస్, ఎమ్మెస్ఐడిసి ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ లు, రోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మహత్య మహా పాపం

**-అనంతపురం సర్వజనాస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత**




**అనంతపురం-సూర్య వాస్తవం:**

అన్ని జన్మల్లోకెల్లా మానవ జన్మ ఉత్తమమైనదని అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన టేక్ ఏ మినిట్ - చేంజ్ ఏ లైఫ్ (ఒక్క నిమిషం ఆగండి - జీవితాన్ని మార్చుకోండి) నినాదంతో అనంతపురంలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. సైకియాట్రి విభాగం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ర్యాలీ ప్రభుత్వాసుపత్రి నుంచి మొదలై తెలుగుతల్లి విగ్రహం వరకు కొనసాగింది. అక్కడ మానవహారంగా ఏర్పాడ్డారు. అక్కడి నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలత మాట్లాడుతూ..మానవ జన్మ ఎంతో అదృష్టం చేసుకుంటే వస్తుందన్నారు. మంచి పనులు చేసి జన్మకు సార్థకం చేసుకోవాల్సిందిపోయి కొందరు బలవంతంగా ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఆత్మహత్య అనేది మహా పాపమని పేర్కొన్నారు. బతికినంత కాలం మంచి సత్ప్రవర్తన, సామాజిక సేవ, అమ్మానాన్నల ఆశలు నెరవేర్చడం, మనపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు న్యాయబద్ధంగా పోషించి వారి ఉన్నతికి దోహదపడాలని కోరారు. అప్పుడే జన్మ చరితార్థమవుతుందని అభిప్రాయపడ్డారు. అయితే కొందరు తమ బాధ్యతలు, కర్తవ్యాలు విస్మరించి, చెడు అలవాట్లకు బానిసలై ఆత్మహత్యకు చేసుకోవడం బాధాకారమన్నారు. మరికొందరు ఒత్తిళ్లు తట్టుకోలేక, చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేక బలవన్మరణాలకు ఒడిగడుతుంటారని, జీవితం అంటే ఇది కాదన్నారు. అసలు ఆత్మహత్యలన్నీ తొందరపాటుగా జరిగిపోతుంటాయన్నారు.

ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అటువంటి వ్యక్తుల్లో ఉత్తేజం, బతుకుపై భరోసా కల్పించే పనులు చేయాలని పేర్కొన్నారు. మానసిక నిపుణులు, సైకాలజిస్టులతో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ పద్మజ, డాక్టర్ శరన్, డాక్టర్ శారద, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ వరదరాజులు, డాక్టర్ రవి, మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధైర్యపడవద్దు..ప్రభుత్వం ఆదుకుంటుంది

**- ఎమ్మెల్యే పరిటాల సునీత**



**రాప్తాడు -సూర్య వాస్తవం:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు, వర్షపు నీళ్లతో వస్తున్న వరదలకు విజయవాడ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లేకుంటే..ఎక్కువ ప్రాణ నష్టం జరిగేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వరద సహాయక కార్యక్రమాల్లో భాగంగా సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాప్తాడు ఎమ్మెల్యే మరియు ముఖ్య టిడిపి నాయకులు కలిసి విజయవాడకు తరలి వెళ్లారు. వరద బాధితులను ఆదుకునేందుకు 61వ డివిజన్ బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఆమె విజయవాడలోని శాంతి నగర్ లో విస్తృతంగా పర్యటించారు. ఐఏఎస్ అధికారి సూర్యతేజ, పలువురు మునిసిపల్ కమిషనర్లు, కార్పొరేటర్ అభ్యర్థి ఉదయశ్రీ, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సునీత వెంట కలిసి వచ్చారు. సాయంత్రం జరిగిన పర్యటనలో మాజీ మంత్రి పీతల సుజాత, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆలపాటి రాజా, ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ కలసి పలు కాలనీలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రతి ఇంటిలోను కన్నీరే కనిపించింది అని అన్నారు. ఇంట్లో ఉన్న ఆధార్ కార్డ్ మొదలు సర్వం కోల్పోయామని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి సంపాదించుకున్న డబ్బు, డాక్యూమెంట్లు, ఇతర వస్తువులన్నీ నీటి పాలయ్యాయని కన్నీరు పెట్టుకున్నారు. బాధితుల ఆవేదన చూసి ఎమ్మెల్యే సునీత చలించిపోయారు. బాధితులకు నిత్యావసరాలు, కూరగాయలు ఇతర వస్తువులు పంపిణీ చేశారు. బాధితుల ఆవేదన చూస్తుంటే చాలా బాధగా ఉందన్నారు. 10 రోజుల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రేయింబవళ్లు బాధితులకు అండగా నిలిచారన్నారు. ఎవరు చూసినా వారి కష్టం చెప్పడంతో పాటు చంద్రబాబు సాయం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. వాటిని ఫైర్ ఇంజిన్లు ద్వారా శుభ్రం చేస్తున్నాము. రెండు మూడు రోజుల్లో సాధారణ పరిస్థితి వస్తుంది. అప్పుడు నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తామన్నారు. బాధితులు పూర్తి స్థాయిలో కోలుకునే వరకు మేము అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# వినాయక నిమజ్జనంలో అపశృతులు అరికట్టాలి

## -డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి -సూర్య వాస్తవం:** వినాయక నిమజ్జనం సందర్భంగాలో అనేక చోట్ల అపశృతులు చోటు చేసుకోవడందురదృష్టకరం, బాధాకరమని సోమవారం నాడు కడప జిల్లా,కమలాపురం నియోజకవర్గం వీరపునాయుని పల్లి మండలం పాలగిరి గ్రామం వద్ద మొ గమూరు ఏటిలో పడి వేంపల్లి గ్రామానికి చెందిన 38 ఏళ్ల బేల్దారి రాజా,25 ఏళ్ల ట్రాక్టర్ డ్రైవర్ వంశీ మృతి చెందారాన్నారు. అదేవిధంగా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం,ఆంజనేయపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి పోలేపల్లి గౌతం కాలేటి వాగులో నిమజ్జనం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో నేర్పుపల్లి క్రాస్ వద్ద ట్రాక్టర్ మీదనుండి క్రిందపడి చనిపోయాడు. ఆదిత్య అనే వ్యక్తికి గాయాలయ్యాయని తిరుపతి జిల్లా,వాకాడు మండలం నాయుడుపేట గ్రామ ప్రజలు సముద్రంలో వినాయక నిమజ్జనం చేస్తుండగా 22 ఏళ్ల ఫయాజ్,మునిరాజా ,మరొక వ్యక్తి సముద్రంలో గల్లంతయ్యారు.ఫయాజ్ శవం కూడా దొరికింది.ఇలాంటి దురదృష్టకర సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు.ఇంకా వారం రోజుల పాటు నిమజ్జనం కార్యక్రమాలు కొనసాగుతాయి.తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకోవచ్చన్నారు. కాబట్టి వినాయక నిమజ్జనం సందర్భంగా అటు కార్యక్రమం నిర్వాహకులు,ఇటు పోలీసు లు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# విజయదుర్గ కాలనీలో ఘనంగా వినాయక నిమజ్జనం



**కడప బ్యూరో -సూర్య వాస్తవం:** కడవ నగరంలోని విజయదుర్గ కాలనీలోని 4వ రోడ్డు లో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినా యక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడు భారీ ఊరేగింపుతో, కళాకారుల కోలాట నృత్య ప్రదర్శన మధ్య ఆనం దోత్సవాల మధ్య నిమజ్జనానికి బయలు దేరాడు. పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని ఘనంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాహలంగా నిమజ్జనం సాగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు గోవిందు నాగరాజు, ఆర్ సుధాకర్, ఏసీ కొండారెడ్డి, పల్లా రాధా కృష్ణ, సిఆర్ సునీల్ జయంత్, సిఆర్ పెద్ద సుబ్బరాయుడు, రాజారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిమ్మారెడ్డి, సాంబశివరెడ్డి, సుబ్బన్న, గుత్తి వేణు, రఘునాథ్ నాయుడు, విజయదుర్గా కాలనీ వాసుల ప్రజలు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ షేక్ హుస్సేన్‌ను పరామర్శించిన ఆమీర్ బాబు

**కడప - సూర్య వాస్తవం:** అనారోగ్యం కారణంగా కడప నగరంలోని ఒలిస్టిక్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ షేక్ హుస్సేన్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆమీర్‌బాబు అక్కడకి వెళ్లి ఆయనను పరామర్శించారు. షేక్ హుస్సేన్ గతంలో అటవీ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎమ్మెల్సీగా సేవలు అందిం చారని. ఆ తర్వాత తన ఎమ్మెల్సీ పదవిని రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రనాయకులు అబ్దుల్ రాయల్ కరిముల్లా నాసిర్‌ఆలీ చాంద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.



# ముస్లిం మహిళలు ప్రతి రంగంలోనూ రాణించాలి..

## - సయ్యద్ మెహతాజ్ బేగం



**రైల్వే కోడూరు -సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం మాట్లాడుతూ ముస్లిం మహిళలు ప్రతి రంగంలోనూ రాణించాలని ఆమె సూచించారు. ఇవాళ ముస్లిం సమాజం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, చదువుపరంగా, వెనుకబడి ఉందని అటువంటి సమాజాన్ని ముందుకు తీసుకు వెళ్లే బాధ్యత ముస్లిం మహిళలు చేపట్టాలని, ఒక భార్యగా ఒక తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ అలాగే మన పిల్లల భవిష్యత్తు కోసం ముస్లిం సమాజం యొక్క అభ్యున్నతి కోసం ముస్లిం మహిళలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ముస్లిం మహిళలు ఎవ్వరికి తీసిపోరని, ముస్లిం మహిళల తమ నైపుణ్యాల మీద దృష్టి పెట్టాలని, చదువులో, రాజకీయంలో, క్రీడారంగంలో వివిధ రంగాలలో ముందుకు దూసుకుపోవాలని ఆమె పేర్కొన్నారు. ఇస్లాం లో పురుషులకు, స్త్రీలకు సమాన హక్కులు కల్పించినప్పటికీ. అది పుస్తకాలలో చదువుకోవడానికి తప్ప నిజ జీవితంలో అమలు కావడం లేదని ఆమె తెలిపారు. ముస్లిం సమాజంలోనీ పురుషులు ఒకరిని ఒకరు విమర్శించుకోవడం తప్ప దేనికి పనికిరారని మన హక్కుల కోసం మనమే పోరాడాలని మన బిడ్డల భవిష్యత్తు కోసం ముస్లిం మహిళలు కదం తొక్కాలని ఆమె పిలుపునిచ్చారు.

**చదువు పరంగా ముస్లిం మహిళలు**

సాధారణంగా ముస్లిం సమాజంలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఇస్తారు, ఇస్లాంలో ఖురాన్ లో మహిళలకు పురుషులకు సమాన హక్కులు ఉన్నప్పటికీ దాన్ని ఆచరణలో మాత్రం పురుషాధిక్యం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత సమాజానికి అనుగుణంగా వచ్చే మార్పులను అవలంబించుకోవడంలో కచ్చితంగా చెప్పాలంటే ముస్లిం సమాజం వెనుకబడింది. ఇస్లాంలో మహిళలకు సమాన హక్కులు ఉన్నప్పటికీ ఆ హక్కులు మాత్రం ఎక్కువగా ధరింపబడుతున్నారు. మరీ ముఖ్యంగా ఒక ఆడపిల్లను స్కూల్ మరియు కాలేజీకి పంపించడానికి తల్లిదండ్రులు సంకోచిస్తారు, అదే మధురసాలకు అయితే బాగా పంపిస్తారు, ప్రస్తుత సమాజంలో ఆధునిక విద్యతోపాటు ఇస్లామిక్ విద్య కూడా అవసరం. అందుకే మగ పిల్లలతో సరిపోల్చుకుంటే ముస్లిం సమాజంలో ఆడపిల్లల చదువు యొక్క రేషియో చాలా తక్కువగా ఉంటుంది.. ఏనాడైతే ముస్లిం ఆడపిల్లలు స్కూలుకు వెళ్లి విద్యను ప్రార్థిస్తాడు ఆనాడు ముస్లిమ్స్ సమాజం సామాజికంగా అభివృద్ధి చెందుతుంది..

**ఉద్యోగాలపరంగా ముస్లిం మహిళలు.**

స్కూల్ కి పంపించడమే దేవుడు ఎరుక మరియు ఉద్యోగాలు అంటే ముస్లిం సమాజంలో చాలా కష్టం, ముస్లిం అబ్బాయిల కంటే ముస్లిం మహిళల రేషియో ఉద్యోగరీత్యా చాలా తక్కువ. కొన్ని కట్టుబాట్లు మరియు ఆధునిక సమాజాన్ని అవలంబించుకోవడంలో ముస్లిం సమాజం చాలా వెనకబడి ఉంది. పట్టణ ప్రాంతాల్లో మన ముస్లిం మహిళలు ఉద్యోగాలు చేయడం చూడవచ్చు కానీ గ్రామీణ ప్రాంతాల్లో అయితే శూన్యం. ఆడపిల్లలను బయటికి పంపకూడదు అనే కట్టుబాటు ముస్లిం సమాజంలో బలంగా నాటుకొని. ఆకట్టుబాటు ఎన్ ఆర్ సి సి ఏ ఏ సమయంలో బద్దలైంది. ఇంట్లో ఉన్న ప్రతి ముస్లిం మహిళా బయటకు వచ్చి ఆనాడు తమ హక్కుల కోసం పోరాటం చేశారు చేపించారు. మత ప్రాతిపదికన వచ్చే సమస్యల కోసం ముందుకు వచ్చే ముస్లిం సమాజం తమ హక్కుల విషయానికి దగ్గరకు వచ్చేసరికి ముందుకు రారు ఎందుకు వస్తేనే చదువుపరంగా ఆర్థికంగా మనం అభివృద్ధి చెందగలం..

**రాజకీయపరంగా ముస్లిం మహిళలు**

రాజకీయాలలో ముస్లిం మహిళలను మనం వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు, రాజకీయాలు అంటేనే ఆమడ దూరంలో ఉండే ముస్లింలు మరీ ముఖ్యంగా మహిళలను రాజకీయంలో పంపిస్తారు అని ఆలోచన కూడా ఉండదు. ఇవాళ రాజకీయ పార్టీలలో ముస్లిం మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువ అసెంబ్లీలో అయితే శూన్యం. రాజకీయ పార్టీలు కూడా ముస్లిం మహిళలను ప్రోత్సహించాలి. అసలు బయటికి రాని ముస్లిం మహిళలు ఒక పార్టీ కోసం పని చేస్తున్నారంటే వాళ్లకి ప్రాధాన్యత కచ్చితంగా ఇవ్వాలి. అలా ఇస్తే ముస్లిం మహిళలు తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోగలరు..

**సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా చదువు పరంగా**

భారతదేశంలో ముస్లింలు పైన పేర్కొన్న సామాజిక ఆర్థిక రాజకీయ మరియు విద్య పరంగా వెనకబడి ఉన్నారు, ఒక్క విద్యతో మనం సామాజిక ఆర్థిక రాజకీయంగా ముందుకు సాగగల. ఇప్పటికి కూడా ముస్లిం సమాజం కొన్ని కట్టుబాట్లు పెట్టుకుని వెనకబడి ఉన్నారు ఆధునిక సమాజాన్ని అవలంబించుకోవడంలో విఫలమయ్యారు ఇకమీదటైనా ఆధునిక యుగంలో ఆధునిక సమీకరాలతో పాటు మనం కూడా మారాలి లేదంటే మనల్ని మనం రాబోయే తరాలలో మ్యూజియంలో చూసుకోవాల్సి వస్తుంది.



# గర్భవతులు, బాలింతలకు పౌష్టిక ఆహారం తప్పనిసరి

## - ఐసిడిఎస్ చాపాడు సెక్టార్ సిడిపిఓ సావిత్రమ్మ



**దువ్వూరు- సూర్య వాస్తవం :** గర్భిణీలు, బాలింతలకు, పౌష్టిక ఆహారం తప్పనిసరి అని ఐసిడిఎస్ చాపాడు సెక్టార్ సిడిపిఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఐసిడిఎస్ గుడిపాడు సెక్టార్ పరిధిలోని సి.బయనపల్లె అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన దువ్వూరులోని దువ్వూరు 3 అంగన్వాడి కేంద్రంలో దువ్వూరు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చాపాడు సెక్టార్ ఐసిడిఎస్ సిడిపిఓ సావిత్రమ్మ హాజరై మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తినే ఆహారం పైనే వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. వారు తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఫైబర్, సూక్ష్మ పోషకాలు అన్నీ ఉండేలా చూసు కోవాలి. ప్రతి సంవత్సరము సెప్టెంబర్ 1 తేదీ నుండి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు జరుపుకుం టాము. మాంస కృతులు సరైన మోతాదులో లేకపోయినా, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా తీసుకున్న అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల సమతుల్యమైన ఆహారం మంచిదన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని,వారి పెరుగుదలకు ఎంతో దోహదపడతాయన్నారు. స్థానికంగా దొరికే పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఐరన్ తో కూడిన ఆహార పదార్థాలను తినాలని సూచించారు. పండ్లు తగిన మోతాదులో తీసుకుంటే రక్తం వృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సౌజన్య, వరలక్ష్మి ,అంగన్వాడీ టీచర్లు సి.రాధ ,కె.విజయ, సి.సునీత ఆయలు, కిషోర్ బాలికలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గర్భవతులు, బాలింతలకు చిరుధాన్యాల మిశ్రమం, పౌష్టికాహారం తప్పనిసరి

## -మండల సెక్టార్ సిడి పి ఓ రమాదేవి



**కడప జిల్లా చెన్నూరు-సూర్య వాస్తవం:** గర్భిణీలకు, బాలింతలకు చిరుధాన్యాల మిశ్రమం, పౌష్టిక ఆహారం తప్పనిసరని పోషణ మాసోత్సవాల్లో చెన్నూరు సెక్టార్ లో సిడిపిఓ రమాదేవి చెన్నూరు ఎనిమిదవ అంగన్వాడి కేంద్రం నందు చిరుధాన్యాల వాడకము చిరుధాన్యాలతో ఆకుకూరలు వేసి రొట్టె చేయడం ప్రత్యక్షంగా తల్లులతో చేయించడం చూపించడం జరిగింది. అదేవిధంగా చిరుధాన్యాలతో మిశ్రమ ఆహారం వండుకోవడము ఆహార వండుకునే పద్ధతుల గురించి తెలిపారు ఎక్కువగా వారంలో నాలుగు రోజులు ఆకుకూరలు ఆహారంలో తీసుకోవాలని అదేవిధంగా కూరగాయలు సీజనల్ లో దొరికే పండ్లను ప్రతిరోజు తినడం వలన రోగ నిరోధక శక్తి కలిగి ఉండడం వలన అనారోగ్యానికి గురి కాకుండా ఉండడానికి దోహదపడుతుందని ప్రతి రోజు కూడా ఒక మనిషి మూడు లీటర్లు మంచినీరు రావడం వలన ఆరోగ్యంగా ఉంటారని చిరుధాన్యాలు వాడడం వలన జీవనశైలిలో వస్తున్నటువంటి షుగర్ బిపి క్యాన్సర్ వంటి జబ్బులకు గురికాకుండా ఉండడానికి సహాయపడతాయని తెలపడం జరిగింది. బాలింతలు తినే ఆహారం పైన వారి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. కార్బోహైడ్రేట్స్, ఫైబర్, సూక్ష్మ పోషక అన్ని ఉండేలా చూసుకోవాలి. ప్రతి సంవత్సరము సెప్టెంబర్ 1 నుండి ఇదివరకు పోషక మహోత్సవాలు ఒప్పుకుంటామని తెలియజేశారు. పండ్లు తగిన మోతాదులో తీసుకుంటే రక్తం అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని వారి పెరుగుదలకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ గురమ్మ అంగన్వాడి కార్యకర్తలు ఇందిరమ్మ తులసి గర్భవతులు బాలింతలు, పెద్దలు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళా స్ఫూర్తి మొల్ల



**మైదుకూరు -సూర్య వాస్తవం:** ఆకాశవాణి కడప కేంద్రం అధికారి మహేష్‌కి మహా కవయిత్రి మొల్ల జీవిత విశేషాలను ఆమె రచించిన మొల్ల రామాయణం సాహిత్యాన్ని గూర్చి చిత్రపటాన్ని అందిస్తూ చర్చిస్తున్న మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఆకాశవాణి కడప కేంద్రంలో అనేక కార్యక్రమాలు రేడియో కార్యక్రమాల ద్వారా ప్రజానీకానికి పరిచయం చేయడం జరిగిందని తన అనుభవాలు ఆకాశవాణి కడప కేంద్రంలో ఎన్నో ఉన్నాయని మొల్ల రామాయణం వ్రాసి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చి ఒక స్త్రీగా ఆమె చేసిన కృషి ఎంత చెప్పినా తక్కువేనని ఆమె ఆనవాళ్లు ఉన్న ప్రాంతాల గూర్చి పలు విషయాల పట్ల కడప ఆకాశవాణి కేంద్రంలో అధికారి మహేష్ తో మాట్లాడడం జరిగింది.

## మానవ సేవే.. మాధవ సేవకు...

# ప్రతిరూపం ఏపీ సీఎం చంద్రబాబు

**- బాబు సమర్థవంతమైన నాయకత్వం వల్లే వరద ముంపు నుంచి బెజవాడ బయటపడింది**

**- ముఖ్యమంత్రి స్ఫూర్తితో “నేను” వరదబాదితులకు అండగా నిలిచా - చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**చిత్తూరు- సూర్యా వాస్తవం :** ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. ఆపదలో ఉన్న విజయవాడ వరదబాదితులకు ఆపన్నహస్తాన్ని అందించి.., సమర్థవంతమైన నాయకత్వానికి నిలువుటద్దంగా నిలవడంతో పాటు.. మానవ సేవే.. మాధవ సేవకు ప్రతిరూపంగా నిలిచారని చంద్రబాబు పాలనాదక్షతను ఆయన కొనియాడారు. ఢిల్లీలో ఉన్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ.., ఉత్తరాంధ్రలో వరుణదేవుడు సృష్టించిన వరద భీభత్సం పై స్పందించారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను వరదలు అతాలాకుతలం చేసాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఉత్తరాంధ్రను కూడా కోలుకోలేని విధంగా దెబ్బతీసాయన్నారు. ఈనేపథ్యంలో ఈ



విపత్తుల నుంచి ప్రజలను రక్షించడానికి.., రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. చిత్తశుద్ధితో పనిచేయడం అభినందనీయమన్నారు. తమ అధినేత చంద్రబాబు ఇచ్చిన పిలుపు స్పందించి, తాను కూడా ఉడతాభక్తిగా.., బెజవాడ బాధి తులకు అండగా నిలిచానని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. 76 ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు నాయుడు రాత్రింబవళ్ళు ప్రజలకోసం పని చేయడం ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం అన్నారు. వరదముంపుకు గురైన విజయవాడ వరదబాదితులను ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చేపట్టిన సహాయక చర్యలు అనన్య సామాన్యమన్నారు. బాబు స్ఫూర్తితోనే తాము కూడా ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నామని ఆయన తెలియజేశారు.

## విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని,,,

# ఏఐటీయూసీ సిఐటియు, ఆధ్వర్యంలో రాస్తారోకో

**- విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రాణ త్యాగాలకు సిద్ధం ప్రభుత్వాలకు ఏఐటియుసి, సిఐటియు హెచ్చరిక**

**చిత్తూరు- సూర్యా వాస్తవం :** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సిఐటియు ఆధ్వర్యంలో చిత్తూరు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద, సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు కాంజీవరం సురేంద్రన్ దాసరి చంద్ర, నాయకత్వంలో రాస్తారోకో, నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ .నాగరాజు సిఐటియు జిల్లా ఉపా అధ్యక్షులు వాడ గంగరాజు లు మాట్లాడుతూ... 9వేల కోట్ల పెట్టుబడికి 58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశరని, 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాలలోకి విశాఖఉక్కును నెట్టాలని బీజేపీ మోడీ ప్రభుత్భం భావిస్తోందని, టిడిపి, జనసేన, కూటమిపై, పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిచేసి విశాఖఉక్కు ప్రేవేటికరణ ఆపడానికి కూటమి నాయకులు



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. ప్రభుత్వమే సొంత ఘనులు విశాఖ ఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు.

32 మంది ప్రాణత్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులు కోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో 45వేల మంది కార్మికుల కుటుంబాలు బ్రతుకుతున్నారని పరోక్షంగా మరోలక్ష మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్న విశాఖ ఉక్కును ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసి ఇబ్బందులకు గురి చేయడం దుర్మా ర్గమన్నారు. అవసరమైతే మరో పోరాటానికి, ప్రాణం తాగానికై సిద్ధం కావాలని కార్యకర్తలకు కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. విభజన చట్టం ప్రకారం, కడప ఉక్కును ప్రారంభించి, వెనుకబడిన రాయలసీమ, నిరుద్యోగులకు, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు, ఆంధ్రులహక్కు, అని నినా దించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్త, ఏఐటీయూసీ నాయకులు కే .రమాదేవి, వి సి గోపీనాథ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే .మునిరత్నంనాయుడు, ఏఐటీయూసీ నాయకులు యస్.జయకుమారి, పి.రఘు, కృష్ణ , మురళి, సంతోష్ సిఐటియు నాయకులు ఆరోగ్యదాస్, చిట్టెమ్మ, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి విజయ గౌరీ, నగరఅధ్యక్షురాలు బి.కుమారి, మహిళా నాయ కులుఏ. కవిత, వి.కోమల, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి సన్నిధిలో ఏర్పాటు చేసిన

# కృత్రిమ ఏనుగులు ప్రారంభం



**ఐరాల- సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయం వద్ద చేరుకున్న మురళీమోహన్ కు ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం విఘ్నేశ్వరుడు దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల వచ్చిన శాసనసభ్యులు మురళీమోహన్ విఐపి గేటు ముఖద్వారం వద్ద మొదటి సారి ఏర్పాటు చేసిన కృత్రిమ ఏనుగులను ప్రారంభించారు. నిజమైన ఏనుగుల వలె ఘింకారం చేస్తూ తొండాన్ని ఊపుతూ ఉండేలా తయారు చేసిన ఈ ఏనుగులను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని మురళీమోహన్ తెలిపారు. ఈ ఏనుగుల బొమ్మలు ఎంతగానో భక్తులను ఆకట్టుకుంటున్నాయని, నిజమైన ఏనుగులే ఘింకారం చేస్తున్నట్లే తలపిస్తున్నాయని భక్తులు తెలియజేసారన్నారు. పిల్లలను, పెద్దలను ఈ ఏనుగులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గురు ప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్, పూతలపట్టు నియోజవర్గానికి చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## కోలాహలంగా

# బొజ్జ గణపయ్య నిమర్జనం

**శాంతిపురం - సూర్య వాస్తవం :**

వినాయక చవితి సందర్భంగా నాల్గవరోజు మండల వ్యాప్తంగా వినాయకుడి నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. మండల పరిధిలోని రాళ్ల బూదుగూరులో ఉదయం 10 గంటలకు శ్రీ మహా విద్య గణపతి హెూమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ వెంకటేష్, ఆర్ఎస్ మణి, బసవరాజు, జయరాజు,కుమార్, మురళి, నారాయణ, యువత పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి ,మహా మంగళహారతి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి మహాలడ్డూ ప్రసాదాన్ని వేలంపాట పాడగా రూ 5వేలకు స్థానిక మీసేవగ నిర్వాహకుడు గోపి ఆ పవిత్ర లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. తదనంతరం మంగళ వాయిద్యాలు, పంపు వాయిద్యములు, డ్రమ్స్ మరియు బాణవేడుకల నడుమ స్వామివారిని శోభాయాత్రగా గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు.





# జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు- సూర్యా వాస్తవం :** చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోమంగళవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా అర్జీ దారుల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐ ఏ ఎస్. చిత్తూరు కలెక్టరేట్ లో నూతన సమావేశపు మందిరం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను నిర్వహిస్తున్న జిల్లా యంత్రాంగం. అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ... సంబంధిత జిల్లా అధికారులకు అర్జీల పరిష్కారం నిమిత్తం తగు సూచనలు జారీ చేస్తూ.. రెవిన్యూ సమస్యలపై సంబంధిత తహసిల్దార్ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మరియు ఫోన్ ద్వారా మాట్లాడుతూ....అర్జీ దారుల సమస్య లపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. జిల్లా కలెక్టర్ తో పాటు కలెక్టర్ డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్ , డిప్యూటీ కలెక్టర్ భవాని, డిఆర్డిఏ పీడీ తులసి లు ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందించిన చిత్తూరు ఎమ్మెల్యే



**చిత్తూరు- సూర్యా వాస్తవం :** గత విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 600 మార్కులకు గాను 596 మార్కులతో ఉత్తమ ప్రతిమ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన స్థానిక రామ్ నగర్ కాలనీకి చెందిన కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని రోషిణిని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభినందించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నరు ఎస్. అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి ప్రశంసలు అందుకున్న చిత్తూరు నగరం సంతపేటకు చెందిన విద్యార్థిని విఎన్. రోషిణిని సోమవారం సాయంత్రం చిత్తూరు ఎమ్మెల్యే అభినందించి విద్యార్థిని ఉన్నత చదువులు కోసం తమ కుటుంబ సభ్యుల ద్వారా నిర్వహిస్తున్న జిజేయం చారిటబుల్ ఫౌండేషన్ తరుపున రూ 10 వేల నగదు ప్రోత్సాకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేశవరెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని తండ్రి నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో

# అలసత్వం చేయకండి

**- ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా “పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్ ” కార్యక్రమం**

**- ఈ రోజు మంగళవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో 25 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్.పి వి.ఎన్.మణికంఠ చందోలు, ఐపీఎస్**



**చిత్తూరు- సూర్యా వాస్తవం:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి వి.ఎన్.మణికంఠ చందోలు, ఐపీఎస్ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్.పి ని మరియు చిత్తూరు డి.ఎస్పీ టి.సాయినాథ్ ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరిత గతిన విచారణ జరిపి ఫిర్యాదు దారులకి న్యాయం చేయాలని సంభందిత అధికారులకు ఆదేశించారు.

## వరద బాధితులకు

# సహాయార్థం 74,657/- రూ విరాళం



**చిత్తూరు- సూర్యా వాస్తవం:** వరద బాధితుల సహాయార్థం బోర్డ్ ఆఫ్ యాన్ సెస్ట్రాల్ అండ్ ఆల్టర్నేటివ్ మెడికల్ సైన్సెస్ (బాస్) వారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కి రూ.74,657 ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు రవి, అంజాద్, కిషోర్, భాస్కర్ లు పాల్గొన్నారు.



# 'సికందర్'లో కాజల్

సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సికందర్'. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా తెరకెక్కి స్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025లో థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందన్న సంగతి ఇదివరకే ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో మరో నటి కూడా నటిస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. సికిందర్ టీంలోకి కాజల్‌కు స్వాగతం పలుకుతూ.. ఆమె సెట్స్‌లో జాయిన్ అయిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా చిత్రబృందం తెలియజేసింది.



## ఈటీవి విన్‌లో

# కమిటీ కుర్రోళ్ళు

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 9న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం ఈనెల 12నుంచి ఈటీవి విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా 'కమిటీ కుర్రోళ్ళు' టీమ్ ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించింది.

నిహారిక కొణిదెల మాట్లాడుతూ,'మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు మరోసారి థ్యాంక్స్. నా ఇండిస్టీ జర్నీ ఈటీవీ డీ జూనియర్స్ షోతో స్టార్ట్ చేశాను. ఈ సినిమా ఈటీవీలో రావడం మేము తీసుకున్న బెస్ట్ డెసిషన్. ఈనెల 12న ఈటీవి విన్‌లో మా సినిమా రిలీజ్ అవుతుంది. థియేటర్‌లో ఎలా అయితే పండగ, జాతరలా ఎంజారు చేశారో, ఈటీవీ విన్‌లో కూడా చూసి అలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

## 'దేవర' రిలీజ్‌కు ముందే

# రికార్డ్ లు బ్రేక్

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కించిన 'దేవర' సినిమా రికార్డులు సృష్టిస్తోంది. రిలీజ్‌కు 17 రోజుల ముందే నార్త్ అమెరికా అడ్వాన్స్ సేల్స్‌లో 1.05ఎమ్‌ను దాటేసింది. దీంతో ట్రైలర్ కూడా రిలీజ్ అవకుండా అడ్వాన్స్ సేల్స్‌లో ఎస్ఐఎమ్ మార్కును దాటిన తొలి భారతీయ చిత్రంగా 'దేవర' నిలిచింది. మంగళవారం సాయంత్రం 5.04 గంటలకు ట్రైలర్ రిలీజ్ అయింది. ట్రైలర్ ఈవెంట్‌లో మూవీ నటీనటులందరూ పాల్గొన్నారు.



# కీలక పాత్రలో..



పలు సూపర్ హిట్ చిత్రాలను అందించిన డైరెక్టర్ వీఎన్ ఆదిత్య కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు అండ్ ఐ సమర్పణ లో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ కేథరిన్ ట్రెస్సా కీలక పాత్రలో నటిస్తున్నారు. మంగళవారం కేథరిన్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విషెస్ చెబుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలతో స్ట్రాంగ్ కంటెంట్‌తో ఈ సినిమాను దర్శకుడు వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో దేశ, విదేశాలకు చెందిన ఎంతో మంది కొత్త నటీనటులకు అవకాశం కల్పిస్తున్నారు. అమెరికన్స్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్, తమిళ్, కన్నడ, తెలుగు ఆర్టిస్టులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమాను యూఎస్‌లోని డల్లాస్‌లో చిత్రీకరిస్తారు. త్వరలో ఈ థ్రిల్లర్ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాత – డాక్టర్ మీనాక్షి అనిపిండి, రచన: పద్మావతి మల్లాది, స్క్రీన్ ప్లే, దర్శకత్వం –వీఎన్ ఆదిత్య.



## ఇండియా-ఎ

# కెప్టెన్‌గా మయాంక్

## పంత్ స్థానంలో రింకూ

**బెంగళూరు :** దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ రేపటినుంచి ప్రారంభం కానుంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన ఆటగాళ్లు మినహా.. మిగిలిన ఆటగాళ్లంతా దులీప్ ట్రోఫీ బరిలోకి దిగనున్నారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్, వికెట్ కీపర్ రిషభ్ పంత్‌లతో పలువురు ఆటగాళ్లకు బిసిసిఐ బ్రేక్ ఇచ్చింది. మంగళవారం బీసీసీఐ దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ కోసం ఆటగాళ్ల లిస్ట్‌ను ప్రకటించింది. ఇండియా–బి తరఫున ఫినిషర్ రింకూ సింగ్ ఆడనున్నాడు. ఓపెనర్ మయంక్ అగర్వాల్ ఇండియా–ఏ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 12 నుంచి దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ జరుగనుంది. ఈసారి ఇండియా–బి తరఫున పంత్ స్థానంలో రింకు సింగ్ బరిలోకి దిగనున్నాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ స్థానలో సుయాశ్ ప్రభుదేశారు ఆడనున్నాడు. ఇండియా–ఏ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నుంచి మయాంక్ అగర్వాల్ పగ్గాలు అందుకోనున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు స్క్వాడ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, అకాశ్ దీప్, అక్షర్ పటేల్‌లు సైతం దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఆడడం లేదు. తొలి రౌండ్‌లో ఇండియా–ఏపై ఇండియా–బి, ఇండియా–డిపై ఇండియా–సి విజయం సాధించిన సంగతి తెలిసిందే.



# పతక విజేతలకు నజరానా

## - ప్రోత్సాహక చెక్కులు అందజేత కేంద్ర క్రీడలమంత్రి మాండవీయ

**న్యూఢిల్లీ:** పారా ఒలింపిక్స్ పతకాలు సాధించిన భారత అథ్లెట్లపై కాసుల వర్షం కురుస్తోంది. అసమాన పోరాటంతో పతకాల పంట పండించిన యోధులకు భారీ ప్రైజ్‌మనీ అందుకున్నారు. న్యూఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెక్కులను అందజేశారు. పారా ఒలింపిక్స్ క్రీడలు ముగియడంతో క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పారా ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్లకు రూ.75లక్షల నగదు చెక్కులను అందుకున్నారు. అలాగే రజత పతక విజేతలకు రూ.50లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.30 లక్షలు చొప్పున అందుకున్నారు. అలాగే ఆర్చరీ మిక్స్‌డ్ విభాగంలో పతకం సాధించిన శీతల్ దేవికి రూ.22.5లక్షలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో సాధించిన రికార్డు పతకాలను 2028 లాస్ ఏంజెల్స్‌లో బ్రద్దలు కొట్టాలని ఆయన ఆకాంక్షించారు. పారా ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సాధనలో దూసుకెళ్తోందని, 2016లో కేవలం 4 పతకాలకే పరిమితమైన భారత్.. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో 19కు పెరిగినా.. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో ఏకంగా 29పతకాలతో 18వ స్థానంలో గర్వ కారణమని కొనియాడారు. రాబోయే పారా ఒలింపిక్స్‌లో భారత్ 50పతకాల మార్క్‌ను అధిగవించడం ఖాయమని ఆయన తెలిపారు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో భారత్ 7స్వర్ణ, 9రజత, 13కాంస్యాలతో సహా 29 పతకాలతో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. 2024 పారా ఒలింపిక్స్ ముగియడంతో భారత అథ్లెట్లందరూ మంగళవారం తిరిగి రాగా.. వారికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.



# అన్వర్ అలీపై నాలుగు నెలల నిషేధం

**కోల్‌కతా:** భారత ఫుట్‌బాల్ ఆటగాడు అన్వర్ అలీపై వేటు పడింది. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్‌ఎఫ్) మంగళవారం నాలుగు నెలల నిషేధాన్ని విధించింది. భారత జట్టు డిఫెండర్ అయిన అన్వర్ అలీ.. ఈస్ బెంగాల్ ఎఫ్‌సి, మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌తో ఒప్పందానికి ప్రయత్నించాడు. ఢిల్లీ ఎఫ్‌సి ఆటగాడయిన అన్వర్.. ఆ క్లబ్ తరఫున ఒప్పందాన్ని రద్దు చేసుకోకుండానే ఈ వ్యవహారం నడపడంతో అతనిపై ఎఐఎఫ్‌ఎఫ్ ప్లేయర్ స్టేటస్ కమిటీ నిషేధాన్ని విధించింది. దీంతో అతడు ఢిల్లీ ఎఫ్‌సి నుంచి అందుకోనున్న రూ.12.9కోట్ల నగదుకు మూడోవంతు వదులుకోవాల్సి ఉంటుంది.





## వినాయకుని పూజలో పాల్గొన్న డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె-సూర్యవాస్తవం:** మండలంలోని దప్పేపల్లి గ్రామం, గొల్లపల్లి, వీరారెడ్డి గారి పల్లిలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకుడు మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సంధర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజక వర్గ ప్రజలందరు సుఖ,సంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించారన్నారు. మండలంలోని సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఇప్పటికే మండలంలో పలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు మంజూరు చేయడం జరిగింది అని,త్వరలోనే పనులు ప్రారంభం చేస్తాం అని అన్నారు.ఈ ఐదు సంవత్సరాలలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి చొరవతో గ్రామాలలో మౌలిక సదుపాయాలు,త్రాగునీటి సమస్యల పరిష్కారం చేయటమే వారి మొదటి ప్రాధన్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడిపి యువ నాయకుడు యనమల మదనమోహన్,టిడిపి నాయకులు ఉమా మహేశ్వర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పెద్ద రెడ్డయ్య,ఓబులేష్ యాదవ్, చిన్న ఓబులేసు,పెద్ద ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ్ రెడ్డి అకాల మృతికి సంతాపం వ్యక్తం చేసిన డాక్టర్ సునీల్ కుమార్



**తవణంపల్లి-సూర్య వాస్తవం :** చిత్తూరు జిల్లా,పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలం, చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు సమాఖ్య నాయకులు జగన్నాథ్ రెడ్డి అకాల మృతికి మంగళవారం పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో, వైయస్ఆర్ సీపీ నాయకులు గురుకువారిపల్లి ప్రకాష్ రెడ్డి, నరోత్తం రెడ్డి, చెర్లోపల్లి జగన్నాథరెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా యూత్ సెక్రెటరీ మిద్దింటి మణిరాజ్, పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పామిడి పోలీస్ స్టేషన్‌ను జిల్లా యస్ పి ఆకస్మిక తనిఖీ



**పామిడి -సూర్య వాస్తవం :** జిల్లాలోని పామిడి పట్టణంలోని పోలీస్ స్టేషను ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐ పి యస్ ఈ పోలీస్ స్టేషన్లలో తరుచు నమోదవుతున్న నేరాలు గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్ ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ యస్ కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్స్ లను మరియు చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీస్ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. వారు నిర్వహిస్తున్న విధులు గూర్చి ఆరా తీశారు. ఈనెల 14 న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీపడదగ్గ కేసులను ఇరు పార్టీలకు కౌన్సిలింగ్ చేసి స్వచ్ఛందంగా రాజీ పడేలా చేసి తద్వారా కేసులు తగ్గించాలన్నారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను, చట్ట పరిధిలో రాజీపడే అవకాశం ఉన్న కేసులన్నింటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ జగదీశ్ తనిఖీలు నిర్వహించిన సమయంలో పామిడి సి.ఐ యుగంధర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## హిందూపురంలో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం



**హిందూపురం టౌన్- సూర్య వాస్తవం:** సత్యసాయి జిల్లా హిందూపురం సీనియర్ న్యాయవాదులు రామచంద్ర రెడ్డి ఇందాద్ శివ శంకర్ వన్నూరప్ప సమక్షంలో ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. వినాయక చవితి పండుగ శుభ సందర్భంగా హిందూపురం ప్రెస్ క్లబ్ ఆవరణలో మహాగణి చెట్టును నాటారు. న్యాయవాదులు మాట్లాడుతూ. ప్రెస్‌క్లబ్ భవనం అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు తమ వంతు అందిస్తామన్నారు.

# మాతా, శిశు మరణాలు అరికట్టాలి

**- డీఎంహెచ్ఓ డా.ఈ.బి.దేవి**




**అనంతపురం -సూర్య వాస్తవం:** మాతృ, శిశు మరణాలు అరికట్టాలని డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి ఆదేశించారు. నగరంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం డిఎంహెచ్ఓ అధ్యక్షతన ఆగస్టు మాసంలో జిల్లాలో జరిగిన 2 మాతృమరణాలు మరియు 25 శిశు మరణాలుకుగాను 2 మాతృ మరణాలు, 6 శిశు మరణాలు ర్యాండమ్ గా మరణాలు జరగడానికి గల కారణాలపై ఆ ప్రాంత డాక్టర్స్ మరియు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి మాట్లాడుతూ మాతృమరణాలు శిశు మరణాలు నివారించాలని, ముఖ్యంగా శిశు మరణంకానీ, మాతృ మరణం కానీ జరిగినప్పుడు మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనాయి, మరణానికి గల కారణాలు తెలుసుకొని మరో సారి అలాంటి కారణంతో మరణం జరగకుండా డాక్టర్స్, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణీ స్త్రీ డెలివరీ తరువాత కూడా తగిన జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు.

ఐసిడియస్. ప్రాజెక్టు వారు గర్భిణీ స్త్రీలకు అందించే న్యూట్రిషన్ ఫుడ్ ను వారు సంపూర్ణముగా తీసుకొనేలా చూసి రక్తహీనతతో బాధ పడకుండా చూడాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు రిజిస్ట్రార్ చేసుకొని ఆమెకు అన్నిరకాల వైద్య పరీక్షలు, వైద్యసేవలు అందించాలని కోరారు. ఏ తల్లి ప్రసవ అనంతరం అధిక రక్తస్రావంతో మరణించకూడదని, ప్రతి గర్భిణీ స్త్రీని పరీక్షించాలని, ప్రమాదకర లక్షణాలు వున్న గర్భిణీ స్త్రీల పట్ల ప్రతేక జాగ్రతలు తీసుకొంటూ సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనత వున్నా, గుండె సంబంధిత సమస్యలు వున్నా, తక్కువ ఎత్తు, తల్లి గర్భంలో ఉమ్మనీరు తక్కవ వున్నా, బిడ్డ పెరుగుదల లేకపోయినా, హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని కోరారు. ఆశాడే రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రము డాక్టర్స్, వైద్య సిబ్బందికి, గర్భిణీ స్త్రీలకు, తల్లి ,బిడ్డకు సంబంధించిన ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. శిశు మరణాల విషయంలో కూడా తగిన జాగ్రతలు తీసుకోవాలని, ఏ శిశువుఐనా నెలలు నిండక పుట్టినా, లేదా తక్కువ బరువుతో పుట్టినా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నా, యన్ఆర్సిలో చేర్పించి పిల్లల ఆరోగ్యం కాపా డాలన్నారు. మాల్ న్యూట్రిషన్ వల్ల ఏ శిశువు మరణించకూడదన్నారు. పుట్టిన ప్రతి శిశువుకు గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. బుడ్డి పాలు తాగించడం మంచిది కాదన్నారు. ప్రతి తల్లి శిశువుకు పాలిచ్చు టెక్నిక్స్ తెలుసుకోవాలన్నారు. అంతిమంగా ఏ శిశువు జన్మిస్తూ మరణించ కూడదు, ఏ తల్లి జన్మనిస్తూ మరణించ కూడదని తెలిపారు.

ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బళ్లారి నున్న శ్రీదేవి, నార్పల సీడీపీఓ భారతి, డిసిహెచ్ఎస్ డా. పాల్ రవికుమార్, డిఐఓ డా. యుగంధర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డాక్టర్స్, మత్తు మందు నిపుణులు డా.నాగేంద్ర, చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.శంకర్ నారాయణ, స్త్రీ వైద్య నిపుణులు డా.నిసార్ బేగం, డా.అరుణ, డా.విజయకుమార్ అప్పా, యంపి హెఛ్ఈఓ లక్ష్మన్న, ఎంపిహెచ్యస్ హేమలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మురికి కూపం ... దోమలకు నిలయం

**- 14 వ డివిజన్ ప్రజలకు శాపం**



**అనంతపురం క్రైం -సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని స్థానిక 14 వ డివిజన్‌లో మురికి కాలువల్లో మురికి చెత్త చెదరంతో నిండిపవడంతో దుర్వాసనలు రావడంతో ప్రజాలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయిన నెలల తరబడి చెత్తను తొలగిచడం లేదని స్థానికులు అంటున్నారు.జనావాసాల్లో డ్రైనేజీలు నిర్మించి వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారా? తెలియడం లేదు. రూ. వేల కొద్ది పన్నులు చెల్లిస్తున్నా మున్సిపాటిటీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.డ్రైనేజీల నిర్వహణలోని బాధ్యతారాహిత్యం వల్ల చెత్త, వ్యర్థాలు పేరుకపోవడంతోపాటు వాటిని తొలగించడం సమస్యగా మారింది.

ఇందులో ముఖ్యంగా అధికారులు అశ్రద్ధ బాగా కనిపిస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.కాలువలో చెత్త చెదారంతో నిండిన నీటిలో దోమలు ఎక్కువ కావడంతో జనాలు జ్వరాల బారినపడే అవకాశాలు ఉన్నాయని జనాలు భయాందోళనకు గురవుతున్నారు

**దోమలకు నిలయంగా....**

దోమలకు నిలయంగా 14 వ డివిజన్ మారింది. దీంతో దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువల్లో దోమలు నక్కి విపరీతంగా పగలు ,రాత్రి తేడా అంటూ లేకుండా కుడుతున్నాయంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ ఇక్కడ వాడడం లేదు.కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అడిగినప్పుడు వచ్చి చెత్త తీయడం కాదు, శాశ్వత పరిష్కారం కావాలంటున్నారు.ఇప్పటికైనా అధికారులు చెత్తకుప్పలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రైతులకు నాణ్యమైన ఉలవలు, టార్పాలిన్ పట్టలు అందిస్తాం



**వీరబల్లి -సూర్య వాస్తవం :** రైతులకు నాణ్యమైన ఉలవలు టార్బాలిన్ పట్టలు తక్కువ ధరలో అందిస్తామని ఏపియం ఖాదర్ వలి తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య కార్యవర్గ సమావేశం కార్యదర్శి రామయ్య ఆధ్యక్షతన జరిగింది.ఏపియం మాట్లాడుతూ సీజనల్ పంటలకు రైతులకు అవసరమయ్యే విత్తనాలు,వ్యవసాయ పరికరాలు కావలసిన వారు మీ పరిధిలో పనిచేసే రైతుమిత్రలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో కల్గుడీ సంస్థతో ఒప్పందం ఉందన్నారు.రైతులకు కావలసిన పిచికారీ యంత్రాలు, డైరీలకు కావసిన పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి రాంప్రసాద్,సీసీ వెంకటలక్ష్మి, ఆకౌంటెంట్ మరియమ్మ,బిఒడి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సిబ్బంది, సాధన నర్సింగ్ కాలేజ్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫార్మా, శ్రీనివాస ఫార్మా కళాశాలల విద్యార్థులతో కలిసి ఆత్మహత్యలు వద్దు జీవితమే ముద్దు, ఆశతో జీవిద్దాం ఆత్మహత్యలు నివారిద్దాం అనే నినాదాలతో మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్యలు నివారించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిసిహెచ్ఎస్ హిమాదేవి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కన్నా ఈ సంవత్సరం ఆత్మహత్యలు పెరిగాయని, భారతదేశంలో ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, యువత, రైతులు, మహిళలు ఎక్కువగా ఆత్మహత్యల ఆలోచన చేస్తున్నారని వివరించారు. మానసిక ఆందోళనను పెరగడం వలనే ఆత్మహత్యల ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితి నుండి వారిని బయటపడేసేందుకు తోటి వారు వారికి భరోసా కల్పించాలన్నారు. అనంతరం మానసిక నిపుణులు కవితా ప్రసన్న మాట్లాడుతూ ఆత్మహత్యల ఆలోచన చేసే వారికి కౌన్సిలింగ్, వైద్య సహాయం కోసం 14416 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

## మాదకద్రవ్యాల నివారణ పక్షోత్సవాలలో భాగంగా ర్యాలీ



**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** మాదక ద్రవ్యాల నివారణ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రొద్దుటూరు స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మత్తుకు యువత చిత్తు దేశ అభివృద్ధికి చేటు పేరిట స్థానిక విజయకుమార్ థియేటర్ సర్కిల్ నుండి పుట్టపర్తి సర్కిల్ వరకు ప్రొద్దుటూరు స్వచ్ఛంద సేవా సంస్థలు, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు కలిసి ప్లేకార్డ్స్ పట్టుకొని ర్యాలీ నిర్వహించి పుట్టపర్తి సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి యువత మత్తు పదార్థాలు బానిసలు కాకుండా దేశ అభివృద్ధికి ర తోడ్పడాలని ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, ప్రొద్దుటూరు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వర రావు, స్టార్ ఫౌండేషన్ సిరాజుద్దీన్, ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాల సూర్య, వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మిదేవి, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకులు, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సార్ఐటీలో ఇంటర్నల్ హాక్ థాన్



**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** మండలంలోని లింగాపురం గ్రామంలో వున్న సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సి. యస్.ఈ డిపార్ట్మెంట్ వారు ఇంటర్నల్ హాక్ థాన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన జీవితంలో మనం ఎదుర్కునే కొన్ని ముఖ్యమైన సమస్యల పరిష్కరించడానికి మరియు ఉత్పత్తి ఆవిష్కరణ సంస్కృతిని మరియు సమస్య పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమం కో- ఆర్డినేటర్ డాక్టర్ వై. సుబ్బారెడ్డి 2024 హాక్ థాన్ నుండి ఎంపిక చేయబడిన 20 జట్లను స్మార్ట్ ఇండియా 2024 హాక్ థాన్ లో ఎస్సార్ఐటీ ద్వారా నామినాట్ చేయబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా గణనాథుని ఊరేగింపు



**సిద్దవటం -సూర్యవాస్తవం:** మండలంలోని మాధవరం-1 గ్రామం భద్రావతి భావనారాయణ స్వామి సన్నిదిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహంకు నాలుగు రోజుల పాటు విశేష పూజలు జరిగాయి. మంగళవారం గణనాథుని నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామి వారిని గ్రామంలోని పుర వీధుల్లో మేళ తాళాలు, బాణాసంచా పేల్చుతూ ఊరేగింపును నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కాయ, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఊరేగింపులో చిన్నా, పెద్ద అని తేడా లేకుండా రంగులు చల్లుకుంటు ఆనందోత్సవాలతో చిందులు వేశారు. స్వామి వారి లడ్డును లక్కీ డిప్ ద్వారా ద్రాతీశారు. దీంతో శంకరాపురం నరేష్ స్వామి లడ్డును కైవసం చేసుకున్నారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని సిద్దవటం పెన్నానదిలో నిమజ్జనం కార్యక్రమంలో భద్రావతి భావనారాయణ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గణేష్ యూత్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న గణేశ నిమజ్జనాలు

**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:**వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని వాడవాడలా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ రూపాలలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు దూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించి, మంగళవారం నాలుగవ రోజు సందర్భంగా ఆయన తల్లి గంగాదేవి చెంతకు తరలించారు. విగ్రహాల మండపం వద్ద ఉట్టి కొట్టడం, అన్నప్రసాద వితరణ నిర్వహించి, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా వినాయక విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించి, కేరింతలతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. కాగా నిమజ్జనోత్సవం సందర్భంగా నిమజ్జనం నిర్వహించే కామనూరు, కెసి కెనాల్, తదితర ప్రాంతాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



## జీవో 115రద్దు చేయాలని ఏఎన్ఎం ల ఆందోళన



**మదనపల్లె క్రైమ్ -సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన జీవో నెంబర్115ను రద్దు చేయాలని కోరుతూ మంగళ వారం మదనపల్లె జిల్లా ఆసుపత్రి వద్ద ఏఎన్ఎంలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013 నుంచి కాంటాక్ట్ బేసిక్ పైన అప్పటి ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకుందన్నారు. అయితే ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమను పెర్మనెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ జీతంతో కొనసాగుతున్న తమను మోసం చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం మూడు రోజుల క్రితం జీవో నెంబర్ 115 తీసుకువచ్చి కొత్తగా ఏఎన్ఎంలను ఉద్యోగాల్లోకి తీసుకొని వారికి 18 నెలలు శిక్షణ ఇచ్చి తమ పోస్టుల్లో వారినే భర్తీ చేసి తమకు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం తీరు మార్చుకొని వెంటనే జీవో నెంబర్115ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చివరి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉదృతం చేసి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## మా జీతాలు మాకు ఇవ్వండి

**- ఆస్పత్రి వద్ద జీడియస్ ఉద్యోగుల ఆందోళన...**




**మదనపల్లి క్రైమ్ -సూర్య వాస్తవం:**

మదనపల్లె సర్వజన ఆసుపత్రిలోని జీడీఏలకు వెంటనే జీతాలు చెల్లించాలని మంగళవారం ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, కృష్ణప్ప మాట్లాడుతూ.. 26మంది ఔట్సోర్సింగ్ కార్మికులకు ఏడాదిన్నర కాలంగా జీతాలు రాలేదని, అధికారులను బ్రతిమలాడుతున్నా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగ, ఉపాధి కోసం వచ్చి అద్దెఇళ్లలో అవస్థలు పడుతున్నారని వాపోయారు.

## విటమిన్లు కలిగిన క్యాప్సికం...

**-రక్తహీనత, అధిక బరువు నివారణి**
**- రేచీకటిని నివారిస్తుంది**

**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:**

విటమిన్లు కలిగిన, రక్తహీనత, అధిక బరువు నివారణి, రేచీకటిని నివారించే కూరగాయ క్యాప్సికం...మనం ఆహారంలో భాగంగా తీసుకునే కూర గాయల్లో క్యాప్సికం ఒకటి. కొందరి దీనిని తినడానికి ఆసక్తి చూపరు...కానీ తినడం వలన చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెప్తున్నారు. ఇందులో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. విటమిన్ సి కూడా ఉంటుంది. కాబట్టి దీర్ఘ కాలిక వ్యాధుల నివారణంలో క్యాప్సికం ఎంతో సహాయపడుతుంది. ఇంకా దీనివల్ల ఎన్నో ప్రయో జనాలు ఉంటాయో ఇప్పుడు చూద్దాం. క్యాప్సికంలో దాదాపు అన్ని రకాల విటమిన్స్ ఉంటాయి. అలాగే తరచుగా తినడం వల్ల ఇది శరీరంలో ఐరన్ లోపాన్ని, రక్త హీనతను తగ్గిస్తుంది. ఫైబర్ కంటెంట్ కూడా ఉండటం మూలంగా అధిక బరువును, మలబద్దకాన్ని తగ్గిస్తుంది.



జీర్ణ క్రియను మెరుగు పర్చడంలో సహాయ పడుతుంది. బీటా కెరోటిన్ ఉండటం వల్ల క్యాప్సికం కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. దృష్టి లోపాలు, ముఖ్యంగా రేచీకటి వంటివి రాకుండా ఉంటాయి. అలాగే లుటిన్, జియాక్సింతిన్ పోషకాలు మెండుగా ఉంటాయి. విటమిన్ సి కూడా ఉండటంవల్ల చర్మ ఆరోగ్యానికి మంచిది. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లకు మూలం కాబట్టి క్యాప్సికం హై కొలెస్ట్రాల్ నివారణలో మంచి ఆహారంగా చెప్పవచ్చు. గుండె జబ్బులు, చర్మ రోగాలను అడ్డుకోవడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖంపై వృద్ధాప్య ఛాయలను పోగొట్టి, యవ్వనంగా కనిపించేలా సహాయపడే పోషకాలు క్యాప్సికంలో ఎక్కువ ఉన్నాయి. క్యాప్రెసిన్ అనే పోషకం వల్ల చర్మ వ్యాధుల నుంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిండంలో క్యాప్సి కం అద్భుతమైన ఆహారం. ఇందులో యాంటీ బ్యాక్టీరి యల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కూడా ఉన్నాయి. కాబట్టి వివిధ అంటు వ్యాధులతో పోరాడే రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కీళ్లు, కాళ్లనొప్పుల నుంచి ఉప శమనం కలిగించే గుణాలు క్యాప్సికంలో ఉన్నాయి. కాబట్టి ఆహారంలో భాగంగా అప్పుడప్పు క్యాప్సికం తీసుకో వాలని పోషకాహార నిపుణులు చెప్తున్నారు.



## రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

**- జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు**

**కడప జిల్లా చెన్నూరు-సూర్య వాస్తవం:** జిల్లా వ్యవసాయ అధికారి ఐతే నాగేశ్వరరావు మంగళవారం చెన్నూర్ 3 రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ చేయడం చెస్తారు. ఈ పంట,ఈ కేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించినారు. సెప్టెంబర్ 15 చివరి తేదీ కావున రైతులు ఈ పంట, ఈ కేవైసీని పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. గ్రామంలోని వరి, బంతి (చెండుమల్లి) పొలాలను సందర్శించడం జరిగినది .వరిలో సూడోమనస్ లీటరు నీటికి పది గ్రాములు పిచికారి చేయడం వలన పాముపొడ, అగ్గి తెగులు రాకుండా కాపాడుకోవచ్చని రైతు లుకు తెలియజేశారు. అదేవిధంగా రైతులు పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు పురుగు ఉధృతి అనగా నిర్ణీత తీవ్రత స్థాయి అనగా ఉదాహరణకు వరిలో ఆకుముడుత కలుగజేసే పురుగు దుబ్బుకి ఒక లార్వా లేదా రెండు పురుగు సోకిన ఆకులు ఉన్నప్పుడు పిచికారి చేయవలెను లేదంటే పిచికారి చేయనవసరం లేదు అని తెలియజేశారు. బంతి వేసిన పొలం సందర్శించి ట్రైకోడెర్మా పశువుల ఎరువులతో అభివృద్ధి చేసి వేయుట వలన పూలు నాణ్యత మరియు సైజు పెరుగునని తెలియజేశారు. మండలవ్యసాయదికారి శ్రీ దేవి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- వైద్యులు, సిబ్బంది రోజువారి విధులలో తప్పనిసరిగా హాజరు కావాలి**
**-ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి**
**- బాల్యవివాహాల నివారణపై గ్రామాలలో అవగాహన కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య - సూర్య వాస్తవం :** పెద్దమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దమండ్యంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించారు. మందుల స్టాక్ పరిశీలించి ఏయే మందులు అందుబాటులో ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోజువారి ఓపి కేసులు ఎన్ని వస్తాయి, ఏయే చికిత్సలకు వైద్య సేవలు అందిస్తున్నారు, డెంగు, ఆ పిహెచ్సి పరిధిలో డెంగు, మలేరియా జ్వరాలు కేసులు ఎన్ని ఉన్నాయి, వాటి నివారణకు తీసుకున్న చర్యలు, హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు, రక్తహీనత కేసులు తదితరాలలో వైద్యులు మరియు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆర్సిహెచ్ రిజిస్టర్, అటెండెన్స్, మందుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఓపిడి మరియు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలలో భాగంగా... ఓపీడీ సేవలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ సేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. రక్తహీనత కలిగిన మహిళలు, పిల్లలకు ఐరన్ మాత్రలను తప్పనిసరిగా అందజేయాలన్నారు.ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి అందుబాటులో లేని మందులను కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు, సలహాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాయచోటిలో రియల్ ఎస్టేట్ గోవిందా... గోవింద

**- ప్రభుత్వ మారి మూడు నెలలు ముగుస్తున్న ఇంత వరకు కదలని రియల్ దందా**
**- వైసిపి హయాంలో నైనా రియల్ ఎస్టేట్ కు ప్రాణం పోశారు**
**- ప్రస్తుతం ఫ్రీ హెూల్డ్ కూడా ఆపడంతో పడిపోయిన రియల్ మార్కెట్**
**ఆవేదన చెందుతున్న లబ్ధిదారులు, బ్రోకర్లు**

**రాయచోటి -సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణ పరిధిలో రియల్ దందా జోరుగా సాగేదని దీంతో రియల్ బ్రోకర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు బాగా పుంజుకొంటూ నిత్యం లావాదేవీలను చూసేవారని ప్రస్తుతం టిడిపి పాలన ఏర్పడి మూడు నెలలు ముగుస్తున్న ఇంతవరకు ఆ ప్రసక్తే లేదని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు బ్రోకర్లు కూడా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గత వైసిపి పాలనలో రాయచోటి అన్నమయ్య జిల్లా కావడంతో భూములకు ధరలు రావడమే కాకుండా ఉన్న స్థలాలు కూడా బాగా ధరలు వచ్చాయని కాస్తో కూస్తో వ్యాపారం చేసుకొని పది రూపాయలు డబ్బులు చేతన పట్టుకొని ఉన్నామని అనంతరం ఆ పెట్టుబడులతో ఎకరాలు ఇల్లు వెంచర్లలో స్థలాలు తీసుకొని లాబపడ్డమని అన్నారు.ప్రస్తుత టిడిపి హయాంలోనైనా రియల్ ఎస్టేట్ బాగా ముందుకు వస్తుందని పది రూపాయలు చేతికొస్తుందని ఆశించిన మేరలో తాము ఉన్నప్పటికీ అలాంటిదేమీ కనిపించడం లేదంటూ వ్యాపారస్తులు చెప్పు కుంటున్నారు. ఇప్పటికే అప్పొ సప్పో చేసి భూములను కొనుక్కొని ఫ్రి హెూల్డ్ కింద రిజిస్టర్ చేసుకునే సమయంలో ఈ ప్రభుత్వం వచ్చి రీ సర్వే అంటూ మూడు నెలలపాటు ఆపడంతో తమ భూములు కొనేవారు ఎవరంటూ కొందరు ఫ్రీ హెూల్డ్ రైతులు కూడా ఆవేదనకు గురవుతున్నారు. అదేవిధంగా వారి వద్ద నుంచి కొనుగోలు చేసిన కొనుగోలుదారులు కూడా ఈ భూములు ఇక అంతేనా వీటిని కొనేవాడు ఎవరు ఉంటారు అంటూ పలు ఆరోపణలు రానే వస్తున్నాయి. ఏది ఏమైనా వైసీపీ హయాంలోనే రియల్ ఎస్టేట్ బాగా సాగి చివర లో కొద్ది రోజులు రియల్ ఎస్టేట్ ఆగిపోయిన తిరిగి టిడిపి ప్రభుత్వం వస్తుంది తమ స్థలాలు ఇళ్లకు ధరలు వస్తాయని అనుకున్న రియల్ దందా వ్యాపారస్తులకు, బ్రోకర్లకు చివరకు కంటతడే మిగిలిందంటూ ఆవేదన గురవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఫ్రీ హెూల్డ్ భూములు కొన్నపటికి వాటిని ఈ ప్రభుత్వం రీ సర్వే పేరుతో ఆపడం అంతే కాకుండా గృహాలు నూతనంగా నిర్మించి అమ్ముకుంటున్న నేపథ్యంలో వ్యాపారాలు కూడా ఆ గిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారుల పైన కాస్త దయచూపి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగేలా తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు కోరుకుంటున్నారు.

## గ్రామ వాలంటీర్లకు జీతాలు మంజూరు చేయండి

**- ఎంపిడిఓకు వినతి**

**సిద్దవటం -సూర్య వాస్తవం:** మండలంలోని సిద్దవటం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ వాలంటీర్లుకు మూడు నెలల జీతాలను మంజూరు చేయాలని మంగళవారం వారు ఎంపీడీఓ జవహర్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్లు 15 ఆగష్టు 2019 న సచివాలయంలో వాలంటీర్లగా జాయిన్ అయ్యామని అయితే 2024 మే నెల వరకు జీత బత్యాలు వచ్చాయని, కాని 8 ఆగష్టు 2024 నుంచి గ్రామ సచివాలయంకు తాము విధులకు హాజరవుతున్నప్పటికి కూడా మాకు సచివాలయం నుంచి ఇప్పటి వరకు హాజరు వేయడంలేదన్నారు.

మూడు నెలలుగా మాకు జీత బత్యాలు ఇవ్వలేదన్నారు. కావున తమ యందు దయచూపి ఆగష్టు నెల వరకు రావలసి జీత బత్యాలను మంజూరు చేయించాలని వాలంటీర్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జవహర్ బాబు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ఉండేది. లేనిది తెలియలేదు. వాలంటీర్ల అటెనెన్స్ షీట్ రావడంలేదన్నారు. అయినప్పటికీ వినతి పత్రాన్ని గ్రామ సచివాలయం వార్డుల జిల్లా అధికారికి పంపుతామని ఎంపిడిఓ పేర్కొన్నారు.



## పంట దెబ్బతిన్న

# ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

### జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి





**నంద్యాల సూర్య వాస్తవం ప్రతిని ధి సెప్టెంబర్ 10:**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, పశు సంపద, రోడ్లు, తదితర ఆస్తి నష్ట వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర రోడ్డు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, తదితర ఆస్తుల నష్టాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల 86 గ్రామాలలో పంటలు, ఇళ్లు, ఇతర ఆస్తులకు నష్టం జరిగిందని ఏ ఒక్క రైతు నష్టపోకుండా నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 9,958 హెక్టార్లలో 42 కోట్ల రూపాయలు విలువైన పంట నష్టం, 25 పూర్తిగా దెబ్బతిన్న కచ్చా గృహాలు, 230 పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు దెబ్బతిన్నా యన్నారు. ఒక పాడి గేద, 45 గొర్రెలు మృత్యువాత పడటంతో పాటు కాటిల్ షెడ్ కూడ దెబ్బతిందన్నారు. అలాగే 206 కిలోమీటర్ల రహదారులు, 24 సీడి వర్క్స్, 142 విద్యుత్ స్తంభాలు , 33 స్కూళ్లలో కిచెన్ షెడ్లు దెబ్బతిన్నాయని మంత్రులు వివరించారు. దెబ్బతిన్న పంట పొలాలను సరిగా లెక్క వేయలేదని మీడియాలో వచ్చిన నేపథ్యంలో వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా లెక్క కట్టాలని మంత్రులు ఆదేశించారు. చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలోని మల్లారెడ్డి కుంటకు గండ్లు పడి వరద నీరు వస్తుందని శాశ్వత ప్రాతిపదికన డిపిఆర్ నివేదికల సిద్ధం చేసి పంపాలనీ ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. ఎస్ఆర్బిసి కాలనీకి వెళ్లే దారిలో కుందూ నదిపై 2017 నుంచి బ్రిడ్జి పెండింగ్లో ఉందని సంబంధిత కాంట్రాక్టర్ ను పిలిపించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు మంత్రులు ఆదేశించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు ఇండెంట్ పెట్టుకొని రైతులకు అవసరమయ్యే యూరియా డిఏపి ఎరువులను తెప్పించుకోవాలని మంత్రులు వ్యవసాయ అధికారులు ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఆగస్టు 31 నుండి కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలోని 22 మండలాలలోని 86 గ్రామాలలో పంట పొలాలు, ఇళ్లు, రోడ్లు దెబ్బతిన్నాయని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. ఇంకా దెబ్బతిన్న పంట పొలాలను లెక్కవేసేందుకు బుధవారం సాయంత్రం వరకు సమయం ఉందని పూర్తిస్థాయిలో లెక్క కట్టి నివేదికలు తయారు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి సోషల్ ఆడిట్ కూడా నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు 90శాతం ఈ పంట నమోదు పూర్తయిందని 33శాతం పైగా పంటలు దెబ్బతింటే భీమా సదుపాయం కూడా వర్తిస్తుందన్నారు. 62 హెక్టార్లలో వాణిజ్య పంటలు కూడా దెబ్బతిన్నాయని వివరించారు. జిల్లాలో 27,205 మట్టి మిద్దెలు ఉన్నాయని వర్షాలకు 276 గృహాలు దెబ్బతిన్నాయని మంత్రులకు వివరించారు. మల్లా రెడ్డి కుంట, గువ్వలకుంట చెరువులకు గండ్లు పడి పంట పొలాలకు నీరు వచ్చిందని తెలిపారు.

శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దాపురం చెరువు పూర్తిగా నిండిందని ఏమాత్రం వర్షం వచ్చినా బండ్ దెబ్బతినే ప్రమాదం ఉందని ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళికతో ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు నష్ట వివరాలను వివరించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ గోడ పత్రికను మంత్రులు, జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే నంద్యాల పట్టణానికి చెందిన పి.పావని వరద బాధితుల సహాయార్థం ఐదువేల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ కు అందజేశారు.

# సరిత హత్య కేసు ఛేదించిన ఇటుకలపల్లి పోలీసులు



**అనంతపురం క్రైం (సూర్య వాస్తవం):**

ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన సరిత హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లో ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కొడవలి, బైకు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఇటుకలపల్లి సి.ఐ హేమంత్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుమ్మఘట్ట మండలం జె.వెంకటంపల్లికి చెందిన తిప్పేస్విమిని మంగళవారం నాడు అరెస్టు చేశామని సి.ఐ చెప్పారు. మూడ్రోజుల కిందట ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా సమీపంలోని పొలాల్లో సరిత హత్యకు గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అరెస్టయిన నిందితుడే ఈ హత్యకు పాల్పడ్డాడన్నారు. ఇతను ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తూ జీవిస్తున్నాడని వివాహం కూడా అయ్యిందని అయితే ఇతనికి గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డికి చెందిన సరితతో పరిచయం ఉందన్నారు. సరిత అనంతపురంలో ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ స్థానిక ఆదిమూర్తినగర్ లోని ఓ హాస్టల్ లో ఉంటోందని తరుచూ సరితను ప్రేమించమని ఫోన్ ద్వారా అడగటం... అందుకు నిరాకరించడంతో ఆ అమ్మాయిపై కసి పెంచుకొని ఈనెల 7 వ తేదీ స్వగ్రామం నుండీ అనంతపురం బయలుదేరిన సరితను ఆత్మకూరు వద్ద బలవంతంగా దింపుకుని తన బైకులో ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని టోల్ ప్లాజా సమీపంలోని పొలాల్లోకి తీసికెళ్లాడన్నారు. అక్కడ కూడా మరోసారి తనను ప్రేమించమని అడిగాడని అందుకు నిరాకరించడంతో అదే అదునుగా భావించి వెంట తెచ్చుకున్న వేట కొడవలితో నరికి చంపి పరారయ్యాడని విలేకరుల సమావేశంలో తెలిపారు. సరిత హత్య కేసును తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఇటుకలపల్లి సి.ఐ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో 2 ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపారు. పక్కా సమాచారంతో సి.ఐ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు గుమ్మఘట్ట మండలం బేలోడు సమీపంలో తిప్పేస్వామిని అరెస్టు చేశామని తెలిపారు. సి.ఐ తో పాటు కేసు ఛేదింపునకు కృషి చేసిన సిబ్బంది అనిల్, హాతీక్, నల్లప్ప , తదితరులను జిల్లా ఎస్పీ అభినందించారు.

## గ్రామీణ ఉపాధి హామీ

# హక్కుల ఉద్యమకారుడు బేడీ



**అనంతపురం-సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పేరెత్తగానే బాహ్య ప్రపంచానికి గుర్తొచ్చేది స్వచ్ఛంధ సేవా సంస్థలు, ఇలాంటి స్వచ్ఛంధ సేవా సంస్థల పుట్టినిల్లు యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ని నరేంద్ర సింగ్ బేడీ 55 సంవత్సరాల కిందట సెప్టెంబర్ 12 న పెనుకొండ దగ్గర గుట్టూరులో స్థాపించారు. పేరెన్నిక గల స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు ఇక్కడ పనిచేసిన వారే. ఆ రోజుల్లో జిల్లా పేరెత్తగానే గుర్తుకొచ్చేది కరువు, క్షామము, పేదరికం. గత ఐదు దశాబ్దాలుగా జిల్లాలో కరువు నివారణ, సుస్థిరత, మానవ హక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాలు, విద్య, వైద్యం, నీటి నిల్వలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణ, ఇంధన పొదుపు, సాంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, ఆహారం, సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధి హామీ పథకం కార్యక్రమాల ద్వారా అభివృద్ధి వైపు ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పనితీరు శ్లాఘించతగ్గది. వయోభారంతో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ క్రియాశీలక పాత్రను నిలిపివేసింది. నిరుద్యోగంలో పెరుగుదల, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, భారతదేశ కార్మిక మార్కెట్లో ఒక ముఖ్యమైన సమస్యను ఎత్తి చూపుతుంది. స్థిరమైన ఉపాధి కనుగొనడంలో యువకులు తరచుగా ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొనే వారు, పెరుగుతున్న గ్రామీణ నిరుద్యోగం తో పాటుగా, పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. పట్టణ కేంద్రాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు తక్కువ. గ్రామీణ యువత కలిగి ఉన్న నైపుణ్యాలు, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాల ద్వారా కోరుకునే నైపుణ్యాల మధ్య అసమతుల్యత ఉందని భావించి, టార్గెటెడ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ల ద్వారా ఈ అంతరాన్ని పరిష్కరించడం వారి ఉపాధి మెరుగుపరచడంలో సహాయపడగలదని భావించారు. ఉద్యోగాలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లోని యువత తక్కువ ఉపాధి పొందే అవకాశం ఉంది, అంటే వారు తమ నైపుణ్యాలను పూర్తిగా ఉపయోగించని లేదా తగిన ఆదాయాన్ని అందించని ఉద్యోగాలలో పని చేస్తున్నారు. అనేక గ్రామీణ ఉద్యోగాలు ప్రకృతిలో కాలానుగుణంగా ఉంటాయి, ప్రత్యేకించి వ్యవసాయంలో, దీని ఫలితంగా ఆఫ్-సీజన్లలో యువ కార్మికులకు నిరుద్యోగం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించడం ద్వారా ఉద్యోగాలు సృష్టించవచ్చు, యువకులు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం చేయాలి. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలను తగ్గించడం మరియు సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉన్న విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో యువత నిరుద్యోగాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ సవాళ్లను పరిష్కరించడం ద్వారా లక్ష్య జోక్యాలను అమలు చేయడం ద్వారా, యువత నిరుద్యోగాన్ని తగ్గించడానికి గ్రామీణ భారతదేశంలో స్థిరమైన ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి పని చేయవచ్చు. కార్మిక భాగస్వామ్య రేటు మరియు ఉపాధి రేటు రెండింటిలో పెరుగుదలతో పాటు నిరుద్యోగం పెరుగుదల గమనించదగినది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్లో కోత పెట్టాలనే నిర్ణయం ఉపాధి మరియు జీవనోపాధికి ఆసరాగా దానిపై ఆధారపడిన గ్రామీణ పేదలపై దాని ప్రభావం గురించి ఆందోళన కలిగిస్తుంది. నారెగా సంవత్సరానికి నిర్దిష్ట సంఖ్యలో రోజుల వేతన ఉపాధికి హామీ ఇవ్వడం ద్వారా మిలియన్ల కొద్దీ గ్రామీణ కుటుంబాలకు భద్రతా వలయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. పథకం యొక్క ప్రత్యేక డిమాండ్-ఆధారిత చట్టపరమైన ఫ్రేమ్వర్క్ గ్రామీణ వర్గాల అవసరాలకు ప్రతిస్పందిస్తుందని నిర్ధారిస్తుంది, ముందుగా నిర్ణయించిన బడ్జెట్ల ద్వారా పరిమితం కాకుండా వారి అవసరాల ఆధారంగా ఉపాధి అవకాశాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. జాతీయ ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్ను తగ్గించడం వలన అవసరమైన వారికి సకాలంలో తగిన మద్దతును అందించడంలో దాని ప్రభావాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉంది, ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం లేదా వ్యవసాయ మందగమనం సమయంలో. జాతీయ ఉపాధి హామీ పథకం కేవలం పేదరిక నిర్మూలన కార్యక్రమం కాదుబీ ఇది గ్రామీణ అభివృద్ధికి ఒక సాధనంగా కూడా పనిచేస్తుంది, మౌలిక సదుపాయాల కల్పన, సహజ వనరుల నిర్వహణ మరియు స్థిరమైన జీవనోపాధికి దోహదపడుతుంది. బడ్జెట్లో ఏదైనా తగ్గింపు గ్రామీణ కుటుంబాల ఆదాయం, శ్రేయస్సును ప్రభావితం చేయడమే కాకుండా విస్తృత అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో పురోగతిని అడ్డుకుంటుంది. ఈ పథకం కోసం బడ్జెట్ను తగ్గించే బదులు, విధాన నిర్ణేతలు దాని ప్రభావాన్ని సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి మార్గాలను అన్వేషించాలి, పథకాన్ని కొనసాగించి గ్రామీణ వర్గాల స్థితిస్థాపకత శ్రేయస్సును నిర్ధారించడానికి, ముఖ్యంగా ఆర్థిక అనిశ్చితి, కష్టాల సమయంలో చాలా ముఖ్యమైనది అని ప్రభుత్వం గుర్తించాలి అని యంగ్ ఇండియా నిర్వాహకులు నరేంద్ర బేడీ, సోనియా బేడీ తెలిపారు. బెంగాల్ లో పుట్టి డూన్ స్కూల్ లో విద్యాభ్యాసం చేసిన బేడీ కి మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎం ఎస్ స్వామినాథన్ లాంటి మేధావులు సమకాలికులు. భారత పూర్వ ప్రధాని రాజీవ్ గాంధీ బేడీ కి మూడు సంవత్సరాల జూనియర్. జాతీయ ఉపాధి హామీ చట్టం రూపకల్పనకు ప్రముఖ ఆర్థికవేత్త శ్రీ హనుమంతరావు ఎందరో మేధావులతో స్వచ్ఛంధ సేవా సంస్థలతో కలిసి పనిచేశారు. యంగ్ ఇండియా లో పనిచేసిన ఇద్దరు క్రియాశీలక సభ్యులు పార్లమెంట్ సభ్యులు అయ్యారంటే సంస్థ పనితీరు ఎలా వుండేదో అర్థం చేసుకోవచ్చు. 86 వయస్సులో హక్కుల కోసం పరితపించే మనస్తత్వం సమాజాభివృద్ధికి తోడ్పడాలని దృఢ నిశ్చయం అలాగే యంగ్ ఇండియా ప్రాజెక్ట్ గ్రామీణాభివృద్ధికి తోడ్పడే విధంగా సెంటర్, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సంకల్పిస్తున్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు



**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి:** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని,నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో, జి.ఎస్.ఆర్. ఆసుపత్రి ప్రముఖ మానసిక వ్యాధి నిపుణురాలు డాక్టర్ ఆరిఫా బాను, డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జి. ఎస్.ఆర్. ఆసుపత్రి నుండి పద్మావతి నగర్ ఆర్చ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నంద్యాల తెలుగుదేశం పార్టీ నాయకులు ఫయాజ్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు.ర్యాలీ ప్రారంభం ముందు జిఎస్ఆర్ ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సభలో ఫయాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని,సమస్యలను దీటుగా ఎదుర్కొని జీవించడమే మనిషి కర్తవ్యం అని అన్నారు.కార్యక్రమ నిర్వాహకురాలు, ప్రముఖ మానసిక వ్యాధి నిపుణురాలు డాక్టర్ ఆరిఫా బాను మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ముఖ్యంగా విద్యార్థులలో, యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించి సమస్యలను ఎదుర్కొనే మనస్తత్వాన్ని పెంపొందించడం అవసరమన్నారు. ఎవరైనా సమస్యలలో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం ఆత్మహత్యల నివారణలో కీలక పాత్ర వహిస్తుందన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు పలు నగరాలు,పట్టణాలలో ఆత్మహత్యల నివారణ ర్యాలీలు ఐఎంఏ తరపున నిర్వహిస్తున్నారని తెలిపారు. నంద్యాల ఐఎంఏ సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ అంశాల పై ప్రజా ఆరోగ్య అవగాహన ర్యాలీలు, విద్యాసంస్థలలో, వివిధ ప్రాంతాలలో అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా,నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనీల్ , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, ఆయుష్ యోగ కేంద్ర నిర్వాహకులు ఆనంద్ గురూజీ, జి.ఎస్.ఆర్.ఆస్పత్రి వైద్యులు మహమ్మద్ రఫీ,సునీల్ కుమార్ రెడ్డి, రాధిక, విజయ బ్లడ్ బ్యాంక్ రక్తదాన శిబిరాల నిర్వాహకుడు సద్దాం,మహిళా వైద్య విభాగం ప్రతినిధులు నాగమణి, నర్మద, లక్ష్మీ సౌజన్య,అరుణ కుమారి,, లక్ష్మీ ప్రసన్న,మాధవి,లలిత, తనూజ, రజని, సీనియర్ వైద్యులు సహదేవుడు, రాజశేఖర్ ,హరినాథ రెడ్డి,రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ్ మూర్తి,నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి,కార్యదర్శి బాలకృష్ణ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, గ్రీన్ సొసైటీ నిర్వాహకులు వెంకట్,క్రిస్టియన్ జేఏసీ నాయకులు జానయ్య, ముస్లిం జేఏసీ నాయకులు అబ్బెస్, మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఫయాజ్ , నజీర్, దాదా, ఆత్మీయ సంస్థ స్వాతి, వాసవి క్లబ్ బింగుమల్ల శ్యాంసుందర్, ఫ్రెండ్స్ ఫర్ సేవ ప్రదీప్ , అయ్యలూరు లైఫ్ లైన్ యూత్ సిద్దు, సాయి యువసేన రవితేజ, డిఎస్ హాజీ ట్రస్ట్ రసూల్, చదరంగం జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల రవికుమార్, పురపాలక పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో అతిథులను వివిధ సంస్థల ప్రతినిధులను జి ఎస్ ఆర్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఆరీఫా బాను, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, డాక్టర్ రాధిక శాలువా జ్ఞాపికలతో సత్కరించి గౌరవించారు.



## సంక్షేమ పథకాల నిధులను
# సద్వినియోగం చేసుకోవాలి

❖ నంద్యాల జిల్లాను రోల్ మోడల్ కు తీసుకురావాలి
❖ జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి

**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి అక్టోబర్ 10:**

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో దిశ కమిటీ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎంపీపీలు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 25 శాఖలకు సంబంధించి 43 సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించుకోకుండా వందల కోట్లు వెనక్కి వెళ్ళిపోవడం బాధాకరమన్నారు. కేంద్రం నుంచి విడుదలైన ప్రతి రూపాయిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని జిల్లా ప్రజలకు మేలు చేసేలా అందరం కలిసికట్టుగా పనిచేసి నంద్యాల జిల్లాను రోల్ మోడల్ గా ఉంచేందుకు కృషి చేయాలని ఆమె సూచించారు. విద్యాశాఖలో 700 కోట్ల రూపాయలు వినియోగించుకోకపోవడం వల్ల వెనక్కి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన 60 శాతం వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకుని రైతులకు నష్టం లేకుండా లాభం చేకూరే విధంగా పనులు చేస్తూ రైతులను ప్రోత్సహించాలన్నారు. నందికొట్కూరులో సీడ్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి ప్రతిరోజు ఫిర్యాదులు వస్తున్నాయని, క్రయ విక్రయాలు జరిగినా రిజిస్ట్రేషన్ కావడం లేదని దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి కొలాయి ఏర్పాటు చేస్తున్నారు కానీ వాటికి శాశ్వత నీటి వనరులు కల్పించడం లేదన్నారు. ఉన్న వనరులను పటిష్టం చేయడంతో పాటు స్థానికంగా ఉన్న రిజర్వాయర్ల నుండి నీటి పైపులైన్లను ఏర్పాటు చేసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. నందికొట్కూరు, పాములపాడు, బనగానపల్లి, సంజామల తదితర మండలాలలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ నిధులను సక్రమంగా వినియోగించుకొని రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పరికరాలు ఉన్నచోట డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, డాక్టరు ఉన్నచోట పరికరాలు లేకపోవడం తదితర లోపాలను సరి చేసుకొని సర్దుబాటు చేయాలని ఆమె వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అన్నిచోట్ల ఆసుపత్రులలోని బయో వేస్టేజ్ ని రోడ్ల పైన పారేయడం, కాలం చెల్లిన మందులను వినియోగించడం తదితర దృశ్యాలను తాను స్వయంగా





గమనించానని సంబంధిత ఏజెన్సీలు నిర్ణీత సమయాలలో తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. నందికొట్కూరు బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కాలం చెల్లిన పదార్థాలతో వడ్డిస్తున్నారని అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆమె జిల్లా విద్యాధికారిని ఆదేశించారు.

విద్యాశాఖకు మంజూరైన కేంద్ర నిధులు సకాలంలో వినియోగించు కోకపోవడం వల్ల తిరిగి వెనక్కి వెళ్తున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఎక్కడా లేనివిధంగా నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అనర్హులకు జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు చేయించడం సరికాదని డ్వామా పీడిని ఆదేశించారు. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరికి వారు ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రకటించుకుంటున్నారని దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అనేక గ్రామాలలో స్మశానవాటికలు లేవని ఉపాధి హామీ పథకం కింద స్మశానవాటికల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ నిమిత్తం కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ కలెక్టర్ ను కోరారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలును పటిష్టవంతంగా చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 70 వేల హెక్టార్లలో రైతులు మోనోక్రాపింగ్ పంటలకే పరిమితమై 9 నెలల కాలం పంట పొలాలను నిరుపయోగంగా ఉంచుతున్నారని భూసార పరీక్షలు నిర్వహించి వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని ఎలాంటి పంటలు వేసుకోవాలన్న అంశాలపై రైతులను ప్రోత్సహించా లన్నారు. జిల్లాలోని రైతులకు భూసార ఆరోగ్య కార్డులు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో 400 హెక్టార్ల ఆయిల్ ఫామ్ సాగుకు గాను 100 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగవుతున్నాయని, మిగిలిన 300 హెక్టార్లలో సాగుకు చర్యలు తీసుకోవాలని హర్టికల్చర్ ఏడిని ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు మంచి అవకాశాలు ఉన్నాయని ప్రతి హెక్టార్ కు 71 వేల రూపాయల సబ్సిడీ వస్తుందన్నారు. ప్రతి తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు భద్రపరిచేందుకు రికార్డు రూములను ఆధునీకరించాలన్నారు. గోస్పాడు కేజీబీవీ పాఠశాలలో నీటి సౌకర్యం సరిగా లేదని ఎంపీపీ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకురావాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో 37 ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులకు నిచ్చెనలు లేవని జడ్పీ నిధులనుండి ఏర్పాటు చేయాలని కలెక్టర్ చైర్మన్ ను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి బయోమెట్రిక్ వేస్టేజ్ డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇ- ఔషధి లాగిన్ లో అవసరమైన మందులను కొరత లేకుండా ముందుగానే ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలన్నారు. జిల్లాలో పెన్షన్ పొందుతున్న 243 మంది ట్రాన్స్జెండర్స్ కాకుండా మిగిలి ఉన్న వాళ్ళని గుర్తించి జాబితా ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వారి జీవన ప్రమాణాల పెంపుదలకు కృషిచేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద కొత్త స్కీముల ద్వారా ట్యాపులు మంజూరు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకుల స్థానంలో కొత్త ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## పంచాయతీ సెక్రెటరీ సస్పెండ్

**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి సెప్టెంబర్ 10:** బనగానపల్లె మండలం కుడా పరిధిలోని లేఔట్ల భవన నిర్మాణాలను నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు మంజూరు చేసిన పంచాయతీ సెక్రెటరీ, గ్రేడ్ -2 ఖలీల్ భాషను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ మైలవరపు కృష్ణ తేజ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు భవన అనుమతులను సరిగా పర్యవేక్షించని ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఎ. శివరామయ్యను కూడా బాధ్యులను చేస్తూ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు మంజూరు చేయడం వల్ల కుడా సంస్థకు 23.5 లక్షల నష్టం వాటిల్లినట్లు సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అభిరుచి మధుకు ఘన సన్మానం

**నంద్యాల-సూర్య వాస్తవం ప్రతినిధి:** నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మదుకు పాణ్యం లో ఘన స్వాగతం లభించింది. పాణ్యం అసెంబ్లీ లో బిజెపి సభ్యత నమోదు కార్యక్రమం లో అభిరుచి మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, పాణ్యం నియోజకవర్గ ఇన్చార్జ్ రామ్ మద్దిలేటి రెడ్డి అధ్యక్షన సభ్యత నమోదు కార్యక్రమం జరగడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు నాగరాజు యాదవ్, కొట్టే చెన్నయ్య పాణ్యం నియోజకవర్గ బిజెపి నాయకులు పాల్గొని నంద్యాలజిల్లా అధ్యక్షుడు అభిరుచి మధుని సన్మానించడం జరిగింది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )